
ఆంధ్రజ్యోతి
5

శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
శనివారం 21 డిసెంబరు 2024

వేతనాలొచ్చేశాయ్..

● ఆయాలు, వాచ్‌మెన్‌కు మూడు నెలల వేతనాలు విడుదల

కొత్తచెరువు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌కు ప్రభుత్వం వేతనాలు విడుదల చేసిందని విద్యాశాఖ ఏడీ-2 రామకృష్ణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఆయాలు 2123 మంది, వాచ్‌మెన్ 232 మంది పనిచేస్తున్నారన్నారు. వారికి రూ.6వేల ప్రకారం జీతం విడుదల చేసిందన్నారు. జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలలకు కలిపి ఆయాలకు రూ.3.80 కోట్లు, వాచ్‌మెన్‌కు రూ.41,57 లక్షల నిధులు వచ్చాయన్నారు. అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల జీతాలు మంజూరు కావాల్సి ఉందని ఆయన తెలిపారు.

ఫ్చ్.. వేస్ట్..!
నిరుపయోగంగా మార్కెట్ యార్డు
పెరిగిపోయిన పిచ్చిమొక్కలు
రోడ్లపై ధాన్యం ఆరబోస్తున్న రైతులు 6



అవినీతి కొత్త పుంతలు
ఫినో అకౌంట్లు సృష్టించి బిల్లులు స్వాహా
వంద రోజులు పని చేయకున్నా బిల్లులు
టెక్నాలజీతో రూ.కోటికిపైగా స్వాహా 7
సామాజిక తనిఖీల్లో తేలినా చర్యలు నిల్



సంపద సృష్టి జరిగేనా?
చెత్తతో సంపద తయారీ
కేంద్రాలపై నిర్లక్ష్యం 6
లక్షలు ఖర్చు చేసినా నిష్ప్రయోజనం
కూటమి ప్రభుత్వంపై గ్రామీణుల ఆశలు



కూల్చేస్తామన్నారు..
కళ్లు మూసుకున్నారు..!

● పుట్టపర్తిలో అక్రమ నిర్మాణంపై అధికారుల ఉదాసీనత
● సర్వత్రా సందేహాలు



ఆక్రమిత స్థలంలో నిర్మిస్తున్న బిల్డింగ్‌కు షట్టర్లు బిగిస్తున్న దృశ్యం

పుట్టపర్తి టౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణమని నిర్ధారించారు, అనుమతులు ఇవ్వలేదన్నారు, సర్వే చేస్తామన్నారు, నోటీలిచ్చామన్నారు, బిల్డింగ్ కూల్చివేస్తామన్నారు.. ఇలా.. అధికారులు ఎన్నెన్నో చెప్పారు. ఆ తరువాత ఏం జరిగిందో, ఏమోగానీ గప్‌చుప్ అయ్యారు. ఆక్రమించిన స్థలంలో నిర్మాణాలు కొనసాగుతున్నా కళ్లు మూసుకున్నారు. పుట్టపర్తి మున్సిపల్, రెవె న్యూ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండడం సర్వత్రా అనుమానాలకు తావిస్తోంది.

కొనసాగుతున్న పనులు

పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని యనుములపల్లిలో సర్వే నంబరు 15లో 64 సెంట్ల నీటి పారుదలశాఖకు చెందిన వాగు భూమి ఉంది. ఇందులో కొంత భాగం ఓ వైసీపీ నాయకుడు ఆక్రమించుకుని, నాలుగు అంతస్తుల భవనం నిర్మిస్తున్నాడు. ఈ అక్రమ నిర్మాణంపై 'వాగును మింగిన వైసీపీ నాయకుడు' శీర్షికన గతనెల 29న 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. దీంతో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు మేల్కొన్నారు. విచారణ చేపట్టారు. అనుమతులు లేకుండా కట్టారని నిర్ధారించారు. కూల్చి వేస్తామని కూడా చెప్పారు. నోటీసులు కూడా ఇచ్చామన్నారు. అధికారుల మాటలన్నీ బీరాలుగా మారాయి. భవన నిర్మాణాన్ని అడ్డుకున్నదీ లేదు, కూల్చిందీ లేదు. దీంతో వైసీపీ నాయకుడు దర్జాగా బిల్డింగ్ నిర్మాణ పనులు కొనసాగిస్తున్నాడు. షట్టర్లు ఏర్పాటు చేస్తున్నాడు. అయినా.. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. నిత్యం అధికారులు తిరిగే ప్రధాన రహదారిలోనే తంతు సాగుతున్నా.. వారు అటువైపు కన్నెత్తి చూడకపోవడం సందేహాలకు తావిస్తోంది.

రాజకీయ దళారీ రంగప్రవేశం

ఇరిగేషన్ వాగు భూమి ఆక్రమణ వ్యవహారాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చిన వెంటనే మండలానికి చెందిన ఓ రాజకీయ దళారీ రంగప్రవేశం చేసినట్లు తెలుస్తోంది. గల్లీనుంచి ఢిల్లీదాకా తనకు తెలియని రాజకీయ నాయకుడు, అధికారి లేడనీ, భవన నిర్మాణానికి ఇబ్బందులు లేకుండా చేస్తానని వైసీపీ నాయకుడికి నమ్మ బలికినట్లు తెలిసింది. ఆ మాటున లక్షలాది రూపాయలు గుంజినట్లు సమాచారం.

కోర్టులో చార్జిషీట్ దాఖలు చేస్తాం..

సర్వే నంబరు 15లో అనుమతులు లేకుండా భవన నిర్మాణం చేపట్టడంపై కోర్టులో చార్జిషీట్ వేస్తాం. ఆక్రమించుకున్న స్థలాన్ని నిర్మాణదారుడు స్వచ్ఛందంగా తొలగించుకుంటానని చెప్పారు. లేదంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

- ప్రహ్లాద, మున్సిపల్ కమిషనర్, పుట్టపర్తి

ఎంతటివారైనా ఉపేక్షించం..

పుట్టపర్తిలోని యనుములపల్లి పరిధి సర్వే నంబరు 15లో ఇరిగేషన్ వాగు భూమిలో అక్రమంగా బిల్డింగ్ నిర్మించినట్లు నా దృష్టికి వచ్చింది. దీనిపై మున్సిపల్ టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ అధికారులు నివేదికలు ఇవ్వాలి. ఆ తరువాత అక్రమ నిర్మాణమని తెలితే చర్యలు తీసుకుంటాం. - టీఎస్ చేతన్, కలెక్టర్

కన్నీటి.. కళింగర..!



కళింగర పంట రైతులకు కన్నీళ్లు మిగిల్చింది. రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పంటను ప్రతికూల వాతావరణం దెబ్బతీసింది. ఇటీవలిగా వరుస తుఫాన్లతో వర్షాలు కురుస్తుండడం, ఎండ లేకపోవడంతో పంటను వైరస్‌లు చుట్టుముట్టాయి. నివారణకు ఎన్నిరకాల మందులు పిచికారీ చేసినా ప్రయోజనం దక్కట్లేదు. దీంతో చేసేదిలేక రైతులు పంటను తొలగించుకుంటున్నారు. మరికొందరు కూలీల ఖర్చు దండగ అని భావించి, పంటను అలాగే వదిలేస్తున్నారు. ఒకవేళ ఎక్కడైనా పంట దక్కినా ధరలు కూడా లేవు. దీంతో రైతులు పూర్తిగా నష్టపోతున్నారు. రూ.కోట్ల పెట్టుబడులు కోల్పోతున్నారు.

- ఆంధ్రజ్యోతి, గాండ్లపెంట



వైరస్ సోకిన కళింగర పంట

నల్లమాడ మండలంలోని సోమయాజులపల్లికి చెందిన ఓ కౌలురైతు సాగుచేసిన పంట ఇది. ఐదెకరాలు కౌలుకు తీసుకుని, పంటపెట్టాడు. రూ.3.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. పంటను వైరస్‌లు చుట్టుముట్టాయి. ఎన్నిరకాల మందులు పిచికారీ చేస్తున్నా అదుపులోకి రాలేదు. దీంతో చేసేదిలేక పంటను ఇలా తొలగించుకుంటున్నాడు. సర్వం నష్టపోయానని రైతు వాపోతున్నాడు.



గిట్టుబాటు ధరలు లేక పంటను వదిలేసిన దృశ్యం

ఇది నల్లమాడ మండలం తూపల్లికి చెందిన రైతు ఫక్రుద్దీన్ సాగుచేసిన కళింగర పంట. నాలుగెకరాలు కౌలుకు తీసుకుని, సాగు చేశాడు. రూ.4 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టాడు. పైరు తొలుత ఆశాజనకంగా ఉండేది. తుఫాన్ల ప్రభావంతో వరుస వర్షాలు కురవడం, ఎండ లేకపోవడంతో పంటను వైరస్‌లు వెంటాడాయి. వాటి నివారణకు రూ.వేలాది రూపాయలు ఖర్చు చేసి, మందులు పిచికారీ చేసినా ఫలితం దక్కలేదు. చేసేదిలేక పంటను వదిలేశాడు. రూ.లక్షల్లో అప్పులు మూటగట్టుకున్నాడు.

● పంటను దెబ్బతీసిన ప్రతికూల వాతావరణం
● వెంటాడిన వైరస్‌లు
● మందులు పిచికారీ చేసినా.. అదుపులోకి రానివైనం
● వదిలేసుకున్న పలువురు రైతులు
● తొలగించుకుంటున్న మరికొందరు..
● రూ.కోట్లలో నష్టం

ఖరీఫ్‌లో కళింగర సాగు చేసిన రైతులకు వాతావరణం అనుకూలించి, మంచి దిగుబడులు వచ్చాయి. గిట్టుబాటు ధరలు దక్కడంతో రైతులు లాభాలు ఆర్జించారు. దీంతో రబీలో మండలంలో పెద్దఎత్తున కళింగర పంట సాగు చేశారు. 600 ఎకరాలకుపైగా పంట పెట్టారు. దుక్కి, బోదులు తోలి, పేపర్ పరిచారు. బోదుల్లోనే ఎరువులు వేశారు. అక్టోబరులో పంట సాగు చేశారు. వాతావరణం అనుకూలించకపోవడంతో పంట చీడపీడల బారిన పడింది.

అనుకూలించని వాతావరణం

రబీలో మండలంలో ఒక్కో రైతు 15 ఎకరాలదాకా కూడా పంట వేశాడు. విత్తనం వేసినప్పట్నుంచి వరుస తుఫాన్లు వచ్చాయి. ఫలితంగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. దీనికితోడు ఎండ లేకపోవడంతో పంటకు వైరస్‌లు విపరీతంగా సోకాయి. పలురకాల క్రిమిసంహారక మందులు పిచికారీ చేసినా ప్రయోజనం దక్కలేదు. గాలిలోనే వైరస్ సోకడంతో కళింగర పంట ఎదుగుదల పూర్తిగా నిలిచిపోయింది. ఇక, పంట చేతికందమని భావించి, వందల ఎకరాల్లో తొలగించుకున్నారు రైతులు.

పాతాళానికి ధర

కళింగర సాగుచేసినపుడు అక్టోబరులో కిలో రూ.15 ధర ఉండేది. ప్రస్తుతం కిలో రూ.4నుంచి రూ.7లోపే పలుకుతోంది. పంటకు చీడపీడల కారణంగా కాయల నాణ్యత కూడా పూర్తిగా తగ్గిపోయింది. దీంతో వ్యాపారులు ధరలు తగ్గించేశారు. మార్కెట్‌లో కొనేవారు కరువయ్యారు. ఎక్కడైనా కాస్తో.. కూస్తో.. పంట చేతికొచ్చినా.. కొనేవారులేక పంటను పొలాల్లోనే వదిలేస్తున్నామని రైతులు వాపోతున్నారు.

అప్పులు మిగిలాయి



ఐదెకరాల్లో కళింగర సాగుచేశా. రూ.నాలుగు లక్షలు ఖర్చు వచ్చింది. విత్తినప్పట్నుంచి పంటకు వైరస్‌లు సోకాయి. పంట పండుతుందన్న ఆశలేదు. చేసేదిలేక తొలగించా. అప్పులు మిగిలాయి.

- చిరంజీవి, రైతు, జీన్లకుంట

వాతావరణ మార్పులతోనే చీడపీడలు

ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా వాతావరణంలో మార్పులు రావడంతో పలు పంటలకు చీడపీడలు సోకాయి. వేడి ఎక్కువగా ఉంటేనే చెట్లు వృద్ధి చెందుతాయి. తుఫాను ప్రభావంతో వేడి శాతం తగ్గిపోయింది. పంటకు వేడి ఎక్కువగా ఉండాలి.

- ప్రతాప్‌రెడ్డి, ఉద్యాన శాఖాధికారి



బుక్కపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

పరుగో.. పరుగు..

● బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ దాడి
● ముందస్తు సమాచారంతో అధికారి, ఉద్యోగులు పరార్

బుక్కపట్నం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం ఏసీబీ దాడుల కలకలం రేగింది. ఏసీబీ అధికారులు వస్తున్నారని తెలుసుకున్న అధికారి, ఉద్యోగులు అక్కడి నుంచి పరారయ్యారు. కార్యాలయంలో ఎవరూ లేకపోవడంతో ఏసీబీ అధికారులు వెనుదిరిగారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్లు విపరీతంగా సాగుతున్నాయని ఏసీబీకి ఫిర్యాదులు వెళ్లినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు.. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై నిఘా వేశారు. తిరుపతికి చెందిన అధికారులు ఈనెల 19వ తేదీన కార్యాలయ పరిసరాల్లో గమనించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో శుక్రవారం సబ్ రిజిస్ట్రార్ రామ్మోహన్ చౌదరి, ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది విధుల్లో ఉన్నారు. సాయంత్రం 4 గంటల తరువాత ఏసీబీ అధికారులు వస్తున్నారన్న సమాచారంతో సబ్ రిజిస్ట్రార్, సిబ్బంది పరారయ్యారు. కాసేపటికి తిరుపతికి చెందిన ఏసీబీ అధికారులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోకి వచ్చారు. అధికారి, సిబ్బంది లేకపోవడంతో వెనుదిరిగారు. విషయం తెలుసుకున్న డాక్యుమెంట్ రైటర్లు సైతం గదులకు తాళాలు వేసుకుని, వెళ్లిపోయారు. కాగా, ఏసీబీ దాడుల విషయంపై సబ్ రిజిస్ట్రార్‌ను సంప్రదించేందుకు ప్రయత్నించగా.. ఫోన్ స్విచాఫ్ వస్తోంది. ఓ ఉద్యోగిని అడగ్గా.. రెవెన్యూ సదస్సుకు వెళ్లినట్లు చెప్పుకురావడం గమనార్హం.

సీఎం కార్యాలయం నుంచి వచ్చే వినతులను క్షేత్రస్థాయిలలో పరిశీలించాలి: కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

పుట్టపర్తి టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చే ప్రజాఫిర్యాదులను క్షేత్రస్థాయిలో క్షుణంగా పరిశీలించి, పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం ఆర్డీఓలు, తహసీల్దార్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. భూసమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి సమావేశాల్లో ఆర్డీఓలందరూ పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్వో విజయ్‌సారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

సందడే.. సందడి..

● కోలాహలంగా పోలీసు స్పోర్ట్స్ మీట్
● పలు క్రీడాంశాల్లో పోటీపడిన ఎస్పీ
● ఏఎస్పీ, డీఎస్పీల మధ్య పరుగు పందెం

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు స్పోర్ట్స్ మీట్‌తో పరేడ్ మైదానంలో ఎటుచూసినా సందడే సందడి. ఎస్పీ రత్న సైతం పలు క్రీడాంశాల్లో పోటీపడి, ఉత్సాహం నింపారు. ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీల మధ్య పరుగు పందెం నిర్వహించారు. దీంతో పోటీల మూడోరోజు శుక్రవారం కోలాహలంగా సాగింది. పోటీలు ముగియడంతో విజేతలకు సాయంత్రం బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విజేతలకు బహుమతులు అందజేసిన అనంతరం ఎస్పీ రత్న మాట్లాడుతూ.. పోలీసు ఉద్యోగం ఒత్తిడితో కూడుకున్నదన్నారు. ఇలాంటి క్రీడాపోటీలతో నూతనోత్సాహం వస్తుందన్నారు. అంతేకాకుండా సిబ్బంది మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు.

ఓవరాల్ చాంపియన్ ఏఆర్ జట్టు

క్రీడాపోటీల్లో ఏఆర్ జట్టు ఓవరాల్ చాంపియన్‌గా అవతరించింది. స్పోర్ట్స్ మీట్ ఓవరాల్ చాంపియన్‌గా మహిళా విభాగంలో ఏఆర్ కానిస్టేబుల్ హేమలత, పురుషుల విభాగంలో ఏఆర్ కానిస్టేబుల్ ప్రసాద్ నిలిచారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పోలీసు స్పోర్ట్స్ మీట్ ముగింపును పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పౌరాణికం, భరతనాట్యం తదితరాలను ప్రదర్శించారు. ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు గానంతో అలరింపజేశారు. సాంస్కృతిక కార్యక్రమ విజేతలకు జిల్లా అదనపు న్యాయాధికారి శైలజ, ఎస్పీ రత్న బహుమతులు అందజేశారు.

పాటపాడిన న్యాయాధికారి, ఎస్పీ

సాంస్కృతి కార్యక్రమాల్లో భాగంగా జిల్లా అదనపు న్యాయాధికారి శైలజ, ఎస్పీ రత్న పాట పాడి, అలరించారు. అనంతరం న్యాయాధికారి మాట్లాడుతూ.. పోలీసు వృత్తి ఎంతో గౌరవమైనదన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు ఎన్నో త్యాగాలు చేస్తుంటారన్నారు. ఇలాంటి క్రీడాపోటీలు నిర్వహించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, డీఎస్పీలు విజయ్‌కుమార్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, కేవీ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.



పాట పాడుతున్న న్యాయాధికారి శైలజ, ఎస్పీ రత్న



కబడ్డీ ఆడుతున్న ఎస్పీ రత్న



ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన ఏఆర్ జట్టు

శరణమయ్యప్పా.. స్వామి..



అయ్యప్పస్వామికి చక్రస్నానం చేయిస్తున్న మాలధారులు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలోని అయ్యప్పస్వామి ఆలయం ఆధ్వర్యంలో శుక్రవారం స్వామివారి చక్రస్నానం వైభవంగా జరిగింది. కోఆప్షన్ మెంబర్ గంగన లక్ష్మిరెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వందలాదిమంది మాలధారులు హాజరయ్యారు. మొదటిరోడ్డులోని ఆలయం నుంచి స్వామివారి ఉత్సవమూర్తిని హెచ్చెల్సీ వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం కెనాల్‌లో ప్రసాద్ నంబూద్రి స్వామి చేతులమీదుగా స్వామివారికి శాస్త్రబద్ధంగా చక్రస్నానం చేయించారు. భక్తులు స్వామివారి ఉత్సవమూర్తిని తలపై ఉంచుకుని నీటిలో మునిగారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయానికి చేర్చారు. మండలపూజల్లో భాగంగా శనివారం సాయంత్రం 6 గంటలకు ఆలయ ఆవరణలో మహాపడిపూజ నిర్వహించనున్నట్లు లక్ష్మిరెడ్డి వెల్లడించారు. కార్యక్రమంలో గురుస్వాములు శ్రీనివాసులు, ఆంజనేయులు, వెంకటనారాయణ, రామ్‌నారాయణ, చలపతి, ఏఎంసీ శ్రీనివాసులు, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్పస్వామిని ఊరేగింపుగా తీసుకొస్తున్న మాలధారులు

నేటి నుంచి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీసీసీఐ కూచ్ బెహర్ అండర్-19 ట్రోఫీలో భాగంగా శనివారం నుంచి ఆంధ్రా-మహారాష్ట్ర జట్ల మధ్య క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆర్డీటీ స్టేడియంలో జరుగుతుంది. ఇప్పటికే జిల్లాకు చేరుకున్న ఇరు జట్ల క్రీడాకారులు శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్టేడియంలో నెట్ ప్రాక్టీస్ చేశారు. ఆంధ్రా హెడ్‌కోచ్ ఏపీ ప్రతాప్, మహారాష్ట్ర హెడ్ కోచ్ అజయ్‌చవాన్‌ల సమక్షంలో బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్, కీపింగ్ ఇలా అన్ని విభాగాల్లో సాధన చేశారు. మ్యాచ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి కార్యదర్శి భీమలింగారెడ్డి తెలిపారు. ఆంధ్రా జట్టుకు జిల్లా క్రీడాకారులు వీరారెడ్డి, జయంత్ కృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే.



నెట్ ప్రాక్టీస్

తిమ్మమ్మను జాతీయస్మారకంగా
గుర్తించాలి

అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్

అనంతపురం కల్చరల్/నంబులపూలకుంట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సాధించిన శ్రీసత్యసాయి జిల్లా ఎన్‌పీ కుంట మండలంలోని తిమ్మమ్మ మర్రిమానును జాతీయ స్మారకంగా గుర్తించాలని అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఢిల్లీలో కేంద్ర పురావస్తుశాఖ డైరెక్టర్ జనరల్ యదుబీర్‌సింగ్ రావత్‌ను ఆయన కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎంతో ఘనమైన చరిత్ర కలిగిన తిమ్మమ్మ మర్రిమాను చరిత్రను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరముందన్నారు. తిమ్మమ్మ మర్రిమానుకు పర్యాటకుల తాకిడి ఎక్కువగానే ఉన్నప్పటికీ అక్కడ కనీస సౌకర్యాలు లేక పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆ ప్రాంతాన్ని జాతీయస్మారకంగా గుర్తించి అభివృద్ధి చేయాలని కోరారు. దీనికి కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ స్పందిస్తూ తిమ్మమ్మ మర్రిమాను అంశాన్ని కేంద్ర అటవీ పర్యావరణ శాఖకు రెకమెండ్ చేస్తామని హామీ ఇచ్చారు.



కేంద్ర పురావస్తుశాఖ డీజీ యదుబీర్‌సింగ్ రావత్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న జాస్తి వీరాంజనేయులు

ప్చ్.. వేస్ట్..

నిరుపయోగంగా మార్కెట్‌యార్డు

- యార్డులో పెరిగిపోయిన పిచ్చి మొక్కలు
- రోడ్లపై ధాన్యం ఆరబోస్తున్న రైతులు



నిరుపయోగంగా మారిన మార్కెట్ యార్డు గోడౌన్



పిచ్చి మొక్కల మధ్య మరుగుదొడ్లు

44వ జాతీయ రహదారిపై ఆరబోసిన వరిధాన్యం

రోడ్డుపైకి రావాల్సిందే



పండించిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి సరైన స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ధాన్యం ఆరబోయాలంటే జాతీయ రహదారులపైకి రావాల్సిందే. ఉన్న మార్కెట్‌యార్డును ఎవరు పట్టించుకోకపోవడంతో అందులో పిచ్చి మొక్కలు పెరిగిపోయి అడవిగా మారింది. అధికారులు, నాయకులు స్పందించి మార్కెట్ యార్డును శుభ్రం చేస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

– నరసింహులు, రైతు, ఇల్లూరు

గార్లదిన్నె, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో మార్కెట్ యార్డు నిరుపయోగంగా మారింది. దీంతో రైతులు పండించిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబోస్తూ నానా ఇబ్బందులు పడుతున్నారు. రైతులు పండించిన ధాన్యం ఆరబోసుకునేందుకు, నిల్వ ఉంచుకునేందుకు కొన్నేళ్ల కిందట కల్లూరు గ్రామం 44వ జాతీయ రహదారి పక్కన మార్కెట్ యార్డు, గోడౌన్‌లు, ప్లాట్ ఫాంలు నిర్మించారు. మండల రైతులతో గతంలో మార్కెట్ యార్డు నిత్యం కళకళలాడేది. మార్కెట్ యార్డులో ఎంతోమంది కూలీలకు ఉపాధి కూడా లభించేది. అయితే రానురాను మార్కెట్ యార్డుపై అధికారులు, పాలకులు శీతకన్ను వేయడంతో అది పూర్తిగా నిరుపయోగంగా మారింది. దీంతో పండించిన ధాన్యాన్ని రైతులు జాతీయ రహదారిపై ఆరబోసుకుంటున్నారు. ఈక్రమంలోనే ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఈ రహదారిపై మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా స్థాయి అధికారులు ప్రయాణిస్తారే తప్ప రైతుల గురించి మాత్రం పట్టించుకోవడం లేదు. మార్కెట్ యార్డులోని గోడౌన్లను కూడా వ్యవసాయేతర పనులకు అద్దెకు ఇచ్చేశారు. కల్లూరులో మార్కెట్ యార్డు ఉందని పాలకులు, అధికారులకు తెలిసినా తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. యార్డును బాగుచేయాలని స్థానిక ఎమ్మెల్యే బండారు శ్రావణిని కోరినట్లు వారు పేర్కొన్నారు.

రైతులకు అనుకూలంగా మార్చాలి



కల్లూరులోని మార్కెట్‌యార్డును కోట్లాది రూపాయలతో రైతుల కోసం నిర్మించారు. కల్లూరు, ఇల్లూరు, కేశవాపురం, కొప్పలకొండ, కమలాపురం సిరివరం తదితర గ్రామాల్లో వేలాది ఎకరాల్లో రైతులు వరి పంటను సాగుచేశారు. అయితే పండించిన పంటను అమ్ముకోవాలంటే ధాన్యం ఆరబోసుకోవాలి. ధాన్యం తడిగా ఉంటే తక్కువరేటుకు కొంటారు. ధాన్యం అరబోసుకోవాలంటే స్థలం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ యార్డును రైతులకు అనుగుణంగా మార్చాలి.

- చెన్నారెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి

వినియోగంలోనే ఉంది

కల్లూరు మార్కెట్‌యార్డు వినియోగంలోనే ఉంది. రైతులు కూడా వరి ధాన్యంను ఆరబోసుకుంటున్నారు. గోడౌన్లను ఎవరు వినియోగించుకోకపోవడంతో ఎలక్ట్రికల్ వారికి అద్దెకు ఇచ్చాం. నెలకు రూ.1.32 లక్షల అద్దె వస్తోంది.

- కేధార్‌నాథ్, నియోజకర్గం మార్కెట్ యార్డు కార్యదర్శి

మార్కెట్‌యార్డును వినియోగంలోకి తేవాలి



రైతులకు ప్రయోజనం చేసేందుకు గత ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి మార్కెట్‌యార్డును నిర్మిస్తే కొందరు అధికారులు వాటిని రైతులకు కాకుండా వ్యాపారులకు అద్దెకు ఇవ్వడం ఏంటి. మార్కెట్‌యార్డును పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెచ్చి రైతులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలి.

- శ్రీనాథ్‌చౌదరి, ఏఐవైఎఫ్

అభివృద్ధి పనులు
వేగంగా చేయండి

సీఎఫ్ యశోదాబాయి

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) అనంతపురం సర్కిల్ పరిధిలోని అటవీశాఖలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సీఎఫ్ (కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) యశోదాబాయి ఆదేశించారు. జిల్లా అటవీశాఖ కార్యాలయంలోని డీఎఫ్ఓ చాంబర్‌లో శుక్రవారం ఆమె సర్కిల్ పరిధిలోని డీఎఫ్ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటికే అనుమతులు పొంది ప్రారంభించిన అభివృద్ధి పనులకు సంబంధించి జిల్లాల వారిగా ఆరా తీశారు. చేస్తున్న పనుల్లో లోపాలకు తావు లేకుండా చూడాలని ఆదేశించారు. గడువులోపు అభివృద్ధి పనులు పూర్తి అయ్యేలా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద అనుమతులు పొంది ప్రారంభించిన పనుల్లో పురోగతి ఉండేలా చూసుకోవాలి ఆదేశించారు. ఎదురయ్యే సమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కారమార్గాలు చూపాలన్నారు. సమావేశంలో అనంతపురం డీఎఫ్ఓ విఘ్నేష్, శ్రీ సత్యసాయి జిల్లా డీఎఫ్ఓ చక్రపాణి, సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ వినోద్‌కుమార్, చిత్తూరు డీఎఫ్ఓ భరణి, పెనుకొండ సబ్‌డీఎఫ్ఓ ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న సీఎఫ్ యశోదాబాయ్

మున్సిపల్ టీచర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి

- డీఈఓకు ఎస్టీయూ నేతల వినతి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అనంతపురం విద్య, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తప్పులు సవరించి ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న మున్సిపల్ టీచర్లకు వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని ఎస్టీయూ నాయకులు డీఈఓను కోరారు. ఆ సంఘం నాయకులు డీఈఓ ప్రసాద్‌బాబును శుక్రవారం ఆయన చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆ సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో ఖాళీలను ప్రమోషన్లతో భర్తీ చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. అయితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక కారణాలతో ప్రమోషన్లు జరగలేదన్నారు. తాజాగా ఇస్తున్న ప్రమోషన్లలో 70:30 నిష్పత్తిలో రోస్టర్ పాయింట్లు లెక్కించి, ఖాళీలు భర్తీ చేయాలన్నారు. తెలుగు,హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ సబ్జెక్టుల సీనియారిటీ జాబితాలు విడుదల చేయాలన్నారు. తాత్కాలిక సీనియారిటీ జాబితాల్లోని తప్పులను సవరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సూర్యుడు, ఫణిభూషణ్, అజయ్‌కుమాంర్, మల్లికార్జున, గంగాధర్,శ్రీనివాసరెడ్డి, కరీముల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కంబదూరు.. అధికారుల బేజారు..!

వైసీపీ హయాంలో భారీ అక్రమాలు

- రూర్బన్‌లో అవినీతిపై లోకాయుక్తకు ఫిర్యాదు
- నిత్యం తనిఖీలతో బెంబేలు
- 12 పంచాయతీలకు ఇద్దరే కార్యదర్శులు
- ఖాళీ కాబోతున్న ఎంపీడీఓ కార్యాలయం



ఖాళీగా కనిపిస్తున్న ఎంపీడీఓ సీటు

కళ్యాణదుర్గం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో జరిగిన అక్రమాలతో ప్రస్తుతం అధికారులు బెంబేలెత్తిపోతున్నారు. ఎప్పుడు ఎవరు తనిఖీలకు వస్తారో.. ఏ రికార్డులు అడుగుతారోనని ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది సతమతమవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ తరహా మౌలిక వసతులు కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 2016లో శ్యాంప్రసాద్ ముఖర్జీ రూర్బన్ మిషన్ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లాలోని కంబదూరు మండలాన్ని ఎంపిక చేశారు. కేంద్రం 30 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 70 శాతం నిధులు కేటాయించేలా మార్గదర్శకాలు రూపొందించారు. మండలంలోని 12 పంచాయతీల్లో వివిధ అభివృద్ధి పనులకు రూ. 127 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. దాదాపు రూ. 100 కోట్ల వరకు వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయి. ఈ పనుల్లో వైసీపీ నాయకులు ఇష్టారాజ్యంగా అక్రమాలకు పాల్పడ్డారు. రూ.కోట్లల్లో అవినీతి జరిగిందని 2020లో లోకాయుక్తకు ఫిర్యాదులు వెళ్లాయి. ఆ మేరకు విచారణ అధికారిగా డీఎస్పీ కోలార్‌క్రిష్ణ వచ్చి 12 పంచాయతీల్లో జరిగిన పనులపై తనిఖీలు చేపట్టారు. క్వాలిటీ కంట్రోల్, విజిలెన్స్, జిల్లా అధికారులు...ఇలా పలు విభాగాల అధికారులు వచ్చి తనిఖీల పేరుతో హడావుడి చేస్తున్నారు. గతంలో పనిచేసిన అధికారుల అవినీతి పాపానికి మా కేంటి ఈ ఖర్మ అంటూ ఈ కార్యాలయంలో పనిచేయడానికి భయపడుతున్నారు. పరిస్థితి చూస్తుంటే కంబదూరు మండల పరిషత్ కార్యాలయం అంతా ఖాళీ అవుతున్నట్లు తెలుస్తోంది. మండల అభివృద్ధికి కీలకమైన మండల పరిషత్తు కార్యాలయంలోనే సిబ్బంది కొరత వెంటాడుతోంది.

ఇన్‌చార్జ్ ఎంపీడీవోనే దిక్కు



కంబదూరు మండల పరిషత్ కార్యాలయం

కంబదూరు మండల పరిషత్ కార్యాలయానికి ఇన్‌చార్జ్ ఎంపీడీవోనే దిక్కుగా మారారు. కళ్యాణదుర్గం ఎంపీడీవో రామచంద్రను కంబదూరుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. రెండు మండలాల్లో పనిచేయాలంటే ఆయనకు తలనొప్పిగా మారింది. కళ్యాణదుర్గం ఎంపీడీవోగానే పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించాలని, కంబదూరు ఇన్‌చార్జ్ వద్దు అంటూ ఉన్నతాధికారులకు విన్నవించినట్లు తెలిసింది. కార్యాలయ ఏవో కూడా అనారోగ్యంతో సెలవులో వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈవోఆర్డీగా గూడెన్న రెండు నెలల క్రితమే మండలానికి వచ్చారు. ఇక్కడ జరిగిన పనులపై సమగ్రంగా నివేదికలు చూపించలేక సతమతమవుతున్నట్లు తెలిసింది. ఈయన కూడా త్వరలోనే పదవీ విరమణ చేయనున్నారు.

అన్నింటిలోనూ అక్రమాలే....

కంబదూరు మండలంలోని 42 గ్రామాల్లో అండర్ గౌండ్ డ్రైనేజీలు, సీసీ రోడ్లు, వీధి దీపాలు, తాగునీటి పైపులైన్లు, ఘన వ్యర్థాల నిర్వహణ, స్థానిక నిరుద్యోగులు, మహిళలకు ఉపాధి శిక్షణ, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీల నిర్మాణం వంటి పనులు చేపట్టారు. ప్రతి పనిలోనూ అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీ అధికారులు గుర్తించారు. ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు, మండల పరిషత్ కార్యాలయ అధికారులు కుమ్మక్కై సుమారు రూ. 25 కోట్ల వరకు అవినీతి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.

12 పంచాయతీలకు ఇద్దరే కార్యదర్శులు

కంబదూరు మండలంలో 12 పంచాయతీలు ఉన్నాయి. ఇద్దరు కార్యదర్శులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. అపార్ కష్టాలతో సతమతమవుతున్న విద్యార్థులకు పంచాయతీ కార్యదర్శుల కొరతతో అస్తవ్యస్తంగా మారిపోయింది. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలకు గ్రామీణులు సతమతమవుతున్నారు. మండల అభివృద్ధిలో కీలకమైన పంచాయతీ కార్యదర్శుల కొరతతో పాలన అస్తవ్యస్తంగా మారింది.

సంపద సృష్టి జరిగేనా..?

చెత్తతో సంపద తయారీ కేంద్రాలపై నిర్లక్ష్యం

- లక్షలు ఖర్చు చేసినా.. నిష్ప్రయోజనం
- కూటమి ప్రభుత్వంపై గ్రామీణుల ఆశలు

రాయదుర్గం రూరల్, డిసెంబరు 20: అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో సంపద సృష్టి ఏమో గాని, ప్రజా ధనం చెత్తలో కలిసిపోతోంది. గత టీడీపీ పాలన(2014-19)లో లక్షలాది రూపాయలు వెచ్చించి చెత్తతో సంపద తయారీ కేంద్రాలను నిర్మించారు. చెత్త సేకరణకు ప్రతి కేంద్రానికి ఇద్దరి నుంచి ఐదుగురు కార్మికుల(క్లాప్‌మిత్ర)ను నియమించారు. వీరు ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి, దాన్ని రీసైక్లింగ్ చేసి ఎరువుగా మార్చి తక్కువ ధరకు రైతులకు అందించాలి. ఇందుకు ఒక్కొక్క కార్మికుడికి నెలకు రూ. ఆరు వేలు జీతం ఇచ్చేవారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం వీటిని పట్టించుకోకుండా గాలికి వదిలేయడంతో కొన్ని చోట్ల సంపద తయారీ కేంద్రాలు దిష్టిబొమ్మలుగా మారాయి. ఇంటింటి నుంచి చెత్త సేకరించడానికి ప్రభుత్వం అందించిన సైకిళ్లు తుప్పుపట్టిపోయాయి.



తుప్పు పట్టిన మూడు చక్రాల వాహనం

జీతాలు సక్రమంగా రాకపోవడంతో క్లాప్ మిత్రులు చెత్త సేకరణకు దూరంగా ఉన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందుకు గ్రామాలలో నిరుపయోగంగా ఉన్న సంపద సృష్టి కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుకుంటున్నారు.

తుప్పు పట్టిన వాహనాలు

చెత్తరహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి మండలంలోని ఆవులదట్ల, కొంతానపల్లి, 74 ఉడేగోళం, చదం, ఆర్‌బీవంక గ్రామాలను గత టీడీపీ ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ క్రమంలోనే మండలంలోని 19 పంచాయతీల్లో 19 చెత్త సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో పని చేసేందుకు 69 మంది క్లాప్‌మిత్రులు, 19 మంది షెడ్ మిత్రులను మొత్తం 88 కార్మికులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రతి నిత్యం క్లాప్ మిత్రులు ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించి ఆ చెత్తను సంపద కేంద్రానికి తరలించి, రీసైక్లింగ్ చేసి ఎరువుగా మార్చాలి. ఆ ఎరువును రైతులకు అమ్మి వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి వాడటం ఈ కార్యక్రమ ఉద్దేశ్యం. అయితే గత ఐదేళ్లతో వైసీపీ ప్రభుత్వం ఈ సంపద నిర్మితి కేంద్రాలను గాలికొదిలేసింది. దీంతో చాలా కేంద్రాల వద్ద చెట్లు పెరిగాయి. వాహనాలు నిరుపయోగంగా మారాయి. ఏళ్ల తరబడి వాహనాలు వాడకపోవడంతో తుప్పు పట్టిపోయాయి. ప్రస్తుతం వాటిని వాడుకోవాలన్నా ఉపయోగపడే పరిస్థితులు లేవు.



నిరుపయోగంగా ఉన్న సంపద తయారీ కేంద్రం

ఐదేళ్లుగా గాలికి వదిలేశారు



గత వైసీపీ ప్రభుత్వం చెత్తతో సంపద తయారీ కేంద్రాల అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదు. కనీసం అందులో పని చేసే వారికి కూడా సక్రమంగా జీతాలు ఇవ్వలేదు. దీంతో కొంతమంది పారిశుధ్య కార్మికులు చెత్తసేకరణకు రావడం మానేశారు. ఈ సమస్యపై ప్రస్తుత ప్రభుత్వం దృష్టి పెట్టి చెత్తతో సంపద తయారీ కేంద్రాలను వాడుకలోకి తీసుకురావాలి.

- రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్, గ్రామదట్ల

ప్రత్యేక దృష్టి



రాష్ట్ర ప్రభుత్వం చెత్తతో సంపద తయారీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. నిరుపయోగంగా ఉన్న ఈ కేంద్రాలను త్వరలో వాడుకలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తాం. వాహనాలకు మరమ్మతులు చేపట్టి ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి కేంద్రాలకు తరలించి ఎరువులు తయారు చేసేలా చూస్తాం.

- కొండన్న, ఎంపీడీఓ

జిల్లా జైలును సందర్శించిన డీఎల్ఎస్ఏ కార్యదర్శి



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి

అనంతపురం క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ కోర్టు న్యాయాధికారి శివప్రసాద్‌యాదవ్ శుక్రవారం జిల్లా జైలును సందర్శించారు. ఖైదీలతో మాట్లాడారు. ఆహారం, నివాసం, ఆరోగ్య స్థితిగతులు, జైలు అధికారుల ద్వారా అందజేస్తున్న సౌకర్యాల గురించి ఖైదీలతో విచారించారు. న్యాయ సేవల లభ్యత, అప్పీల్ హక్కు, ప్లీ బేరసారాలు, న్యాయ సహాయం గురించి ఖైదీలకు తెలియజేశారు. అనంతరం ఓపెన్ ఎయిర్ జైలు, ప్రభుత్వ బాలుర అబ్జర్వేషన్ హోమ్‌ను సందర్శించారు.

అదృశ్యమైన వారి గుర్తింపులో నిర్లక్ష్యం తగదు

గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్ శివప్రసాద్



సిబ్బందితో మాట్లాడుతున్న డీపీఓ నాగరాజనాయుడు

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో మిస్సింగ్ సిటిజన్స్ గుర్తింపులో నిర్లక్ష్యం వహిస్తే ఇబ్బందులు తప్పవని గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్ శివప్రసాద్ జిల్లా అధికారులను హెచ్చరించారు. కమిషనరేట్ నుంచి శుక్రవారం జిల్లా అధికారులతో ఆయన జూమ్ మీట్ ద్వారా సమీక్ష నిర్వహించారు. డీపీఓ నాగరాజనాయుడు సంబంధిత సిబ్బందితో కలిసి తన చాంబర్‌లో జూమ్‌మీట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ, వార్డుల్లో మిస్సింగ్ సిటిజన్స్ గుర్తింపుపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని కమిషనర్ ఆదేశించినట్లు తెలిపారు. ఆధార్ నమోదుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కూడా సూచించినట్లు పేర్కొన్నారు. ఈక్రమంలోనే జిల్లాలో చాలా వరకు అన్ని పనులు పూర్తి చేశామని, పెండింగ్ ఉన్నవాటిని వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని చెప్పినట్లు డీపీఓ వెల్లడించారు.

క్రైం కార్నర్

బైకును ఢీకొన్న ట్రాక్టర్.. ఒకరి మృతి

బెళుగుప్ప, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలపల్లి గేట్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం ట్రాక్టర్ బైకు ఢీకొనడంతో శ్రీరంగాపురానికి చెందిన తిమ్మప్ప (44) మృతి చెందాడు. గుండ్లపల్లి నుంచి వరిగడ్డి వేసుకుని ఓ ట్రాక్టర్ బెళుగుప్పకు వస్తుండగా, బెళుగుప్ప నుంచి స్వగ్రామానికి బైకులో బయల్దేరాడు. అయితే నక్కలపల్లి గేట్ వద్దకు రాగానే ట్రాక్టర్ ఎదురుగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో తిమ్మప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్‌ఐ శివ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. మృతుడికి భార్య కళావతి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

బియ్యం స్వాధీనం

అనంతపురం న్యూటౌన్/బత్తలపల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు విజిలెన్స్ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. బత్తలపల్లి సమీపంలోని పాల డెయిరీ వద్ద జాతీయ రహదారిపై విజిలెన్స్ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ఓ వాహనంలో కర్ణాటకకు తరలిస్తున్న 62 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం యజమాని మహేష్, కొనుగోలుదారుడు నరేష్, డ్రైవర్ సతీష్, సహాయకుడు అశ్వత్థనారాయణను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి, పీడీఎస్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించామని తెలిపారు. తనిఖీల్లో డీసీటీఓ సురేష్ కుమార్, బత్తలపల్లి సీఎస్‌డీటీ రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

మూడు టిప్పర్ల పట్టివేత

పెనుకొండ రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అధిక లోడుతో వెళ్తున్న మూడు టిప్పర్లను పట్టుకున్నట్లు కియ పోలీసు స్టేషన్ ఎస్‌ఐ రాజేష్ తెలిపారు. టిప్పర్లు అధికంగా కంకర లోడ్ చేసుకుని, వెళ్తుండగా కియ పోలీసు స్టేషన్ సమీపాన గురువారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. వాటిని ఆర్టీఓకు అప్పగించారు. అధిక లోడ్ ఉన్నట్లు గుర్తించి జరిమాన విధించారు. శుక్రవారం సాయంత్రం జరిమానా చెల్లించడంతో వదిలేశారు. ఇద్దరు ప్రజాప్రతినిధుల మధ్య వ్యవహారం కారణంగానే టిప్పర్లను పట్టుకున్నట్లు తెలిసింది.

కానిస్టేబుల్ అసభ్య ప్రవర్తన

తాడిపత్రి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ధర్మవరం నుంచి మచిలీపట్నం వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులో ఓ యువతి పట్ల ఓ కానిస్టేబుల్ అసభ్యంగా ప్రవర్తించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కానిస్టేబుల్ తీరుపై ఆగ్రహించిన తోటి ప్రయాణికులు దేహశుద్ధి చేసేందుకు ప్రయత్నించగా, బాత్రూంలోకి వెళ్లి దాక్కున్నట్లు తెలిసింది. ఆ కానిస్టేబుల్ బాత్రూం నుంచి గంటపాటు బయటకు రాలేదని సమాచారం. విజయవాడ కనకదుర్గమ్మ ఉత్సవాల బందోబస్తుకు ఆ కానిస్టేబుల్ గుత్తి నుంచి వెళుతూ.. గురువారం రాత్రి ఇలా వ్యవహరించాడని సమాచారం. ఎర్రగుంట్ల స్టేషన్‌లో బాధితురాలు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయాలని భావించారని, తల్లిదండ్రులు నచ్చజెప్పడంతో వదిలేశారని సమాచారం.

యువకుడి హత్య


గిద్ద రాజు (ఫైల్)

కుందుర్పి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డే పాళ్యం గ్రామానికి చెందిన గిద్ద రాజు (32)గురువారం రాత్రి కర్ణాటక సరిహద్దులోని నాగేపల్లి గేటు సమీపాన హత్యకు గురైనట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన మేరకు... గిద్దరాజు కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే వాడు. ఎప్పటిలాగే గురువారం కూడా కూలి పనులకు వెళ్లిన గిద్దరాజు సాయంత్రమైన ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పలుచోట్ల ఆరా తీశారు. అయితే కర్ణాటక ప్రాంతంలో శుక్రవారం గిద్దరాజు మృతదేహం పడి ఉండటం చూసి స్థానికులు కర్ణాటక పోలీసులకు సమాచారం అందించారు. పరశురాంపురం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని పరిశీలించారు. మృతుడిని వడ్డేపాళ్యం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. మృతదేహన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం పరశురాంపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హత్య జరిగిన ప్రాంతాన్ని చిత్రదుర్గ ఎస్పీ రంజిత్ భండార్, సీఐ హనుమంతప్ప పరిశీలించారు. పరశురాంపురం ఎస్‌ఐ బసవరాజు హత్య కేసుగా నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గిద్దరాజుకు ఏడాది కిందట ఈశ్వరమ్మతో వివాహం జరిగింది. వీరికి ఐదు నెలల పాప ఉంది.

ముగ్గురికి డెంగీ ?

శెట్టూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నబలపంపల్లి గ్రామంలో హర్షిత అనే మూడేళ్ల చిన్నారికి డెంగీ సోకినట్లు డాక్టర్లు నిర్ధారించారని బాలిక కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అలాగే తిప్పేరుద్ర అనే వ్యక్తికి, మరో ఇద్దరు చిన్నారులకు కూడా డెంగీ లక్షణాలు ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. గత కొన్ని రోజులుగా జ్వరం వస్తుండటంతో స్థానికంగా వైద్యం చేయించుకున్నా ఫలితం లేకపోయింది. దీంతో వారు జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు డెంగీ సోకినట్లు నిర్ధారించారని బాధితులు పేర్కొన్నారు. గ్రామంలో అపరిశుభ్రత పేరుకుపోవడంతో దోమలు వృద్ధి చెంది, రోగాలు వ్యాపింపజేస్తున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జ్వర పీడితులకు వైద్యసిబ్బంది సక్రమంగా వైద్యం అందించకపోవడంతో కూడా ఇబ్బందులు పడుతున్నామని వారు పేర్కొన్నారు. ఉన్నతాధికారులకు స్పందించి గ్రామంలో అపరిశుభ్రతను తొలగించి వ్యాధుల బారిన పడకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అవినీతి... కొత్త పుంతలు..!

- ఫేనో అకౌంట్లు సృష్టించి బిల్లులు స్వాహా
- వంద రోజులు పని చేయకున్నా బిల్లులు
- దూర ప్రాంతాల్లో ఉన్న వారి పేరుతో రికార్డులు
- టెక్నాలజీతో రూ.కోటికిపైగా దోపిడీ
- సామాజిక తనిఖీలో తేలినా చర్యలు నిల్



విడపనకల్లు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో అవినీతి కొత్త పుంతలు తొక్కింది. కొందరు అక్రమార్కులు ఫేనో అకౌంట్లు సృష్టించుకుని, బోగస్ జాబ్ కార్డులతో 100 రోజులు పనులు చేసినట్లు చూపి ప్రజాధనం కాజేశారు. ఇలా 2023-24 సంవత్సరంలో జరిగిన ఉపాధి పనుల్లో రూ.కోటికిపైగా స్వాహా చేసినట్లు సామాజిక తనిఖీల్లో జిల్లా అధికారులు తేల్చారు. అయితే 15 రోజులైనా ఏ ఒక్కరి పైనా చర్యలు తీసుకోలేదు. ఆర్ఆర్ యాక్ట్, క్రిమినల్ కేసులు పెడతామని సామాజిక తనిఖీలో అధికారులు చెప్పిన మాటలు ఉత్తుత్తివయ్యాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

టెక్నాలజీతో మాయ

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా విడపనకల్లు మండలంలో ఉపాధి సిబ్బంది


రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

టెక్నాలజీని ఉపయోగించి ఫేనో అకౌంట్లు సృష్టించారు. బిల్లులు ఖాతాలో పడగానే వాటిని డిలిట్ చేశారు. హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీలో ఉద్యోగాలు చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర ప్రాంతాల వాళ్లు విడపనకల్లు మండలంలోకి వచ్చి ఉపాధి పనులు చేసినట్లు రికార్డులు సృష్టించారు. కంప్యూటర్ ఆపరేటర్ సుభాన్, పాల్తూరు ఫీల్డ్ అసిస్టెంట్ గురుస్వామి, జనార్దనపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ వడ్డే జానకీరాముడు, కరకముక్కల ఫీల్డ్ అసిస్టెంట్ రామస్వామి, ఆర్ కొట్టాల ఫీల్డ్ అసిస్టెంట్ మంజునాథలు తమ తెలివికి పని చెప్పి అన్ని మార్గాల్లో నిధులు కాజేశారు. ఉపాధి హామీ పథకం సీఓ చేతిలో ఉండాల్సిన లాగిన్ పాల్తూరు, జనార్దనపల్లి ఫీల్డ్ అసిస్టెంట్‌ల చేతిలోకి వెళ్లటం వల్ల ఇష్టారాజ్యంగా బిల్లులను కాజేశారు.

పాల్తూరులోనే రూ.28 లక్షల అవినీతి

పాల్తూరు గ్రామంలో 35 మంది జగనన్న ఇళ్లను నిర్మించుకుంటే వారికి ఇవ్వాల్సిన ఉపాధి బిల్లులను ఆ గ్రామంలో లేని వారి అకౌంట్లుకు వేసి దాదాపుగా రూ. 8.5లక్షలు కాజేశారు. జాబ్ కార్డుల్లో పనులు చేయని వారికి ఫేనో అకౌంట్లు క్రియేట్ చేసి వారు 100 రోజులు పనులు చేసినట్లు రికార్డులు సృష్టించి దాదాపుగా రూ. 12లక్షలు కాజేశారు. జాబ్ కార్డులో హిందూ మహిళా జానశ్రీ అనే పేరు ఉంటే ఆ కార్డులో ముస్లిం పేర్లను చేర్చి ఫినో అకౌంట్ల ద్వారా వంద రోజులకు బిల్లులు వేశారు. అనంతరం వారి పేర్లను తొలగించారు. ఇలా ఒక్క పాల్తూరు గ్రామంలోనే దాదాపుగా రూ. 28లక్షలు అవినీతికి పాల్పడ్డారు. పాల్తూరులో 1115 జాబ్ కార్డులును మంజూరు చేశారు. కానీ 562 జాబ్ కార్డులకు చెందిన వారు మాత్రమే పనులకు వెళ్తున్నట్లు రికార్డులు చేశారు. మిగిలినవి దొంగ మస్టర్లతో ఉపాధి బిల్లులు మంజూరు చేసుకున్నారు. సోషల్ ఆడిట్ వారికి రికార్డులు ఇవ్వకుండా, అన్నీ కాలువలో కొట్టుకు పోయాయని మాయ చేశారు. ఆన్ లైన్‌లో తనిఖీలు చేయగా అన్ని దొంగ జాబ్ కార్డులుగా తేలినట్లు తెలిసింది. కేసులు నమోదు చేస్తామని అధికారుల బెదిరించటంతో అప్పటికప్పుడు జాబ్ కార్డులు, మస్టర్ల జిరాక్స్‌లు తెచ్చి అధికారులు ఎదురుగానే కూలీలతో సంతకాలు చేయించి ఇచ్చారు.

ఎవరికీ అనుమానం రాకుండా...

ఫేనో అకౌంట్లతో పాటు ఎవరికి అనుమానం రాకుండా వివిధ బ్యాంక్‌లకు ఉపాధి బిల్లులు మంజూరు చేసి డబ్బులు డ్రా చేసుకున్నారు. ఐడీబీ, కెనరా, ఫేనో, ఎస్‌బీఐ, ఓవర్సీస్, ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ, ఇలా వివిధ రకాల బ్యాంక్‌లకు బిల్లులు మళ్లించి రూ. కోటికి పైగా కొల్లగొట్టారు.

ఇలా మొత్తం రూ. కోటికిపైగా అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీల్లో తేల్చారు. ఇంత అవినీతి జరుగుతున్నా అప్పటి ప్రోగ్రాం అధికారి, ఏపీఓ, టీఏలు, అందరూ కళ్లు మూసుకుని రికార్డుల్లో సంతకాలు చేశారా అనే సందేహాలు కలుగుతున్నాయి. ఇంత అవినీతి జరిగితే జిల్లా అధికారులు ఏ ఒక్కరిపైనా ఇప్పటికి చర్యలు చేపట్టలేదు. కనీసం కేసులుకూడా పెట్టకపోవటంలో ఆంతర్యం అంటుబట్టకుండా ఉంది. ఇంత అవినీతి జరిగినా, ఒక్క రికార్డు లేకుండా మాయం చేసినా అక్రమార్కులను కాపాడేందుకు జిల్లా, మండల స్థాయిలో అధికారులు ప్రయత్నిస్తుండటంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

గ్రామాల వారిగా అవినీతి

పాల్తూరు	రూ.28లక్షలు
వేల్పుమడుగు	రూ.8.30లక్షలు
కడదరబెంచి	రూ.2.12లక్షలు
డొనేకల్లు	రూ.4.92లక్షలు
గడేకల్లు	రూ.98వేలు
హావళిగి	రూ.1.24లక్షలు
కొట్టాలపల్లి	రూ.5.82లక్షలు
అంచనహాలు	రూ.13వేలు
వీ కొత్తకోట	రూ.13వేలు
మాళాపురం	రూ.2.15లక్షలు.
ఆర్ కొట్టాల	రూ.1.59లక్షలు
విడపనకల్లు	రూ.7.42లక్షలు
చీకలగురికి	రూ.4.48లక్షలు
జనార్దనపల్లి	రూ.4.08లక్షలు
కరకముక్కల	రూ. 12.79లక్షలు
ఉండబండ	రూ.8.79లక్షలు
పొలికి	రూ.25.81లక్షలు

హంద్రీనీవా లైనింగ్‌తో నష్టం

- కాలువను వెడల్పు చేయండి
- జలసాధన సమితి డిమాండ్


హంద్రీనీవా కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న జలసాధన సమితి నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ లైనింగ్‌తో జిల్లా రైతాంగానికి తీవ్రనష్టం కలుగుతుందని, ఆ పనులను వెంటనే ఆపాలని జలసాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. లైనింగ్ వేయడానికి బదులుగా కాలువను వెడల్పుప చేయాలని కోరారు. హంద్రీనీవా ప్రయోజనాలకు సమాధి కట్టే 404, 405 జీఓలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జలవనరుల శాఖ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, సాగునీటిరంగ నిపుణులు ఎస్‌ఎం బాషా, రచయిత శాంతి నారాయణ, జలసాధన సమితి అధ్యక్షుడు రామ్‌కుమార్ ఈ సందర్భంగా మాట్లాడారు. ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓలు హంద్రీనీవా ప్రాజెక్ట్ ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా ఉన్నాయని, రాయలసీమ ప్రజలకు తీవ్రనష్టం కలిగించే ఆ ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాయలసీమలోని ఆరు లక్షల ఎకరాల ఆయకట్టు, జిల్లాలో ఉన్న 3.45 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు రూపకల్పన చేసిన హంద్రీనీవా ప్రాజెక్ట్‌ను నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. హంద్రీనీవా ప్రధాన లక్ష్యం ప్రకారం మల్యాల నుంచి జీడిపల్లి వరకు 10 వేల క్యూసెక్కులు, జీడిపల్లి నుంచి గొల్లపల్లి వరకు 6 వేల క్యూసెక్కులు, గొల్లపల్లి నుంచి మారాల వరకు 5వేల క్యూసెక్కులు, మారాల నుంచి చెర్లోపల్లికి 4500 క్యూసెక్కులు, మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు 1500 క్యూసెక్కుల సామర్థ్యంతో కాలవను వెడల్పు చేయాలని కోరారు. శ్రీశైలం నుంచి తెచ్చుకున్న కృష్ణా జలాలను నిల్వ చేసుకోవడానికి అవసరమయ్యే ప్రాజెక్టులు, డిస్ట్రిబ్యూటరీలను వెంటనే నిర్మించి జిల్లాను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం హంద్రీనీవా చీఫ్ ఇంజనీర్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, జలసాధన సమితి ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, రైతుసంఘం నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, సీపీఎం నాయకుడు మల్లికార్జున, అఖిలభారత రైతుసంఘాల నాయకులు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వివిధ సంఘాల నాయకులు కృష్ణ, సురేష్, యేసు, పెద్దన్న, వీరనారప్ప, చంద్ర, వెంకటేష్, నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

పరిటాల రవి హత్య కేసులో...

బెయిలుపై నలుగురు విడుదల


కడప సెంట్రల్ జైలు నుంచి బెయిలుపై విడుదలవుతున్న పరిటాల రవి హత్య కేసు ఖైదీలు

కడప క్రైం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత పరిటాల రవి హత్య కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న నలుగురు శుక్రవారం బెయిలుపై విడుదల అయ్యారు. 2005 జనవరి 25న అనంతపురంలో రవి హత్యకు గురయ్యారు. ఈ కేసులో 12 మందికి శిక్ష పడింది. నలుగురు కడప కేంద్ర కారాగారంలో జీవిత ఖైదు అనుభవిస్తున్నారు. వీరికి హైకోర్టు షరతులతో కూడిన బెయిలు మంజూరు చేసింది. వీరి విడుదల సందర్భంగా కుటుంబ సభ్యులు కడప కేంద్ర కారాగారానికి చేరుకున్నారు. విడుదలైన వారిని వాహనాల్లో ఎక్కించుకుని సొంతూర్లకు వెళ్లారు. పరిటాల రవి హత్య కేసులో ముద్దాయిలు మద్దలచెరువు సూరి, మొద్దు శీను, కొండారెడ్డి, పటోళ్ల గోవర్ధనరెడ్డి చనిపోయారు. ఆరు నెలల క్రితం వన్నా హనుమంతురెడ్డి, వడ్డె శీను, పెద్దిరెడ్డి బెయిలుపై బయటకు వచ్చారు. ప్రస్తుతం కడప సెంట్రల్ జైలు నుంచి నారాయణరెడ్డి, ఓబిరెడ్డి, రంగనాయకులు, వడ్డె కొండ విడుదలయ్యారు. వైజాగ్ సెంట్రల్ జైలులో ఉన్న రేఖమయ్య కూడా విడుదల అయ్యారు. వీరంతా ప్రతి సోమవారం స్థానిక పోలీసుస్టేషనులో హాజరు కావాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా బెయిలుపై వచ్చిన వారిని మీడియా పలకరించే ప్రయత్నం చేయగా నారాయణరెడ్డి స్పందిస్తూ హైకోర్టు ఉత్తర్వులమేరకు ఈ విషయాలపై స్పందించబోమని అన్నారు. కారు ఎక్కి వెళ్లిపోయారు. అయితే 18 ఏళ్ల తరువాత బెయిలుపై విడుదలయ్యారంటూ వారి బంధువులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పగవాడికి కూడా ఇలాంటి కష్టాలు ఉండకూడదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

అగ్రిగోల్డ్ ఆస్తులను బాధితులకు పంచాలి

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

పుట్లూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న అగ్రిగోల్డ్ ఆస్తులను డిపాజిటర్లకు పంచిపెట్టాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కడవకల్లు-చెర్లోపల్లి గ్రామాల మధ్యన ఉన్న అగ్రిగోల్డ్ భూములను రాష్ట్ర, జిల్లా నాయకులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. దేశవ్యాప్తంగా 8 రాష్ట్రాల్లో 32 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులు ఉన్నారని అన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తులు రూ.6300 కోట్లు ఉన్నా డిపాజిటర్లకు న్యాయం చేయడం లేదని విమర్శించారు. న్యాయం జరగకపోవడంతో చాలామంది నిరుపేదలు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో కేవలం రూ.900 కోట్ల పరిహారం చెల్లించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ఏడు వేల ఎకరాల అగ్రిగోల్డ్ భూములను సీఐడీ అటాచ్ చేసిందని, వాటిని అమ్మి బాధితులకు సొమ్ము చెల్లించాలని డిమాండ్ చేశారు. పుట్లూరు మండలంలో 210 ఎకరాల విలువైన భూమిని వైసీపీ నాయకుడు సాగుచేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. వంద ఎకరాలకు పైగా భూముల్లో గుట్టుగా పంటలు ఎలా సాగుచేశారని మండిపడ్డారు. పేదలకు చెందాల్సిన భూములను వైసీపీ నాయకులు సాగు చేసుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్రాంతిలోపు ఆ భూములను ఖాళీ చేయకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అగ్రిగోల్డ్ భూములు అమ్మి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. నాయకులు అగ్రి గోల్డ్ భూములలో పంటలను పరిశీలిస్తుండగా పోలీసులు వచ్చి వెళ్లిపోవాలని సూచించారు. దీంతో


అగ్రిగోల్డ్ భవనం వద్ద మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర నాయకులు

పోలీసులపై సీపీఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము దొంగతనంగా రాలేదని, అగ్రిగోల్డ్ బాధితుల తరఫున వచ్చామని అన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు వైసీపీ నాయకులకు వత్తాసు పలుకుతున్నారని, ఇంతవరకు అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. దీంతో పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నారాయణస్వామి, తిరుపతిరావు, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కుళ్లాయప్ప, సిద్దేశ్వర, జిల్లా అధ్యక్షుడు నారాయణప్ప, మండల కార్యదర్శి పెద్దయ్య, రైతు సంఘం నాయకుడు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఒలింపిక్స్‌లో భాగస్వామ్యమే సీఎం ధ్యేయం

- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ


గెలుపొందిన జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఒలింపిక్స్‌లో రాష్ట్ర క్రీడాకారులను భాగస్వామ్యం చేయడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు క్రీడలను ప్రోత్సహిస్తున్నారని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన మూడురోజుల జోనల్ క్రీడాపోటీలు శుక్రవారంతో ముగిశాయి. ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి పర్యవేక్షణలో జరిగిన ముగింపు పోటీలకు ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గెలుపొందిన జట్లకు ఆయన ట్రోఫీలను అందజేశారు. కళాశాల స్థాయిలోనే విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని నింపేలా కూటమి ప్రభుత్వం పోటీలను నిర్వహిస్తోందని అన్నారు. ఆటలలో గెలుపోటములు సహజమని, విజయం సాధించేదిశగా విద్యార్థులు కృషిచేయాలని సూచించారు. బాలికల విభాగంలో అనంతపురం కళాశాల విద్యార్థులు ఖోఖో, బ్యాడ్మింటన్ డబుల్స్, వాలీబాల్ పోటీల్లో విజయం సాధించారు. బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో పీవీకేకే, పరుగు పందెంలో అనంతపురం పాలిటెక్నిక్ కళాశాల క్రీడాకారులు విజయం సాధించారు. బాలుర విభాగంలో అనంతపురం, ధర్మవరం జట్లు విజయం సాధించాయి. విజయం సాధించిన జట్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

దంపతుల ఆత్మహత్య



మృతిచెందిన గోవిందరెడ్డి, జ్యోతి

పావగడ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యలతో పట్టణంలోని వైఈఆర్ రంగయ్యశెట్టి డిగ్రీ కళాశాల వెనుకవైపున శుక్రవారం దంపతులు గోవిందరెడ్డి, జ్యోతి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోవిందరెడ్డిది అనంతపురం జిల్లా కుందుర్పి మండలం వెంకటంపల్లి. అతడికి లక్ష్మీతో వివాహమైంది. 20 ఏళ్ల క్రితం బెంగళూరుకు వలస వెళ్లి అక్కడే ఉంటున్నారు. అక్కడ జ్యోతితో పరిచయమై, ఆమెను కొన్నేళ్ల క్రితం రెండో వివాహం చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో గోవిందరెడ్డి, జ్యోతి గురువారం రాత్రి పావగడకు వచ్చి, ఓ లాడ్జిలో గది తీసుకున్నారు. శుక్రవారం ఉదయం మద్యం బాటిల్ తీసుకుని, అందులో విషం కలుపుకుని కళాశాల వెనకవైపునకు వెళ్లి తాగారు. కాసేపటికే జ్యోతి మృతిచెందింది. గోవిందరెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. మృతదేహాలను ఏఎస్పీ మరియప్ప, డీఎస్పీ రామచంద్రప్ప, సీఐ సురేష్, ఎస్‌ఐ గురునాథ్, పరిశీలించారు. దంపతుల ఆత్మహత్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యుత్ కంచె తాకి వ్యక్తి మృతి

- తోట యజమానికి రెండేళ్ల జైలు శిక్ష

మడకశిరటౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): తోటకు రక్షణగా ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి, వ్యక్తి మృతిచెందిన కేసులో యజమానికి జైలు శిక్ష పడింది. మండలంలోని బుడ్డయ్యపాళ్యం గ్రామానికి చెందిన బి.హనుమంతరాయప్ప 2019లో తన దానిమ్మ తోటకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా కరెంటు తీగలు ఏర్పాటు చేశాడు. అదే గ్రామానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తి కంచెను తాకి, విద్యుదాఘాతంతో మరణించాడు. దీనిపై అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసును మడకశిర జూనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.అశోక్‌కుమార్ విచారించారు. హనుమంతరాయప్పపై నేరం నిర్ధారణ కావడంతో రెండేళ్ల కఠిన కారాగారశిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు కోర్టు కానిస్టేబుల్ బాలకృష్ణ తెలిపారు.

మెప్మా అధికారి, ఆర్పీపై కేసు

ధర్మవరం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): బోగస్ మహిళా సంఘాలను సృష్టించి, రుణాలు కాజేశారన్న ఫిర్యాదు మేరకు మున్సిపాలిటీలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో పనిచేస్తున్న టీఎంసీ వెంకటేశ్, ఆర్పీ శోభారాణిపై వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. 5 బోగస్ సంఘాలను సృష్టించి, వాటి ద్వారా రూ.కోటికిపైగా ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు నుంచి రుణాలు తీసుకుని, స్వాహా చేసినట్లు తెలుస్తోంది. దీనిపై బ్యాంకు మేనేజర్ జ్యోత్స్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

మూడు పుస్తకాలు.. విజ్ఞాన దీపికలు

కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత రాచపాళెం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): నిర్భయ గొంతుకతో వి.రాంభూపాల్ చేసిన రచనలు విజ్ఞాన దీపికలుగా ఉపయోగపడుతాయని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ రచించిన మూడు పుస్తకాలను జిల్లా పరిషత్ నూతన హాల్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. మానవ హక్కుల వేదిక నాయకుడు ఎస్‌ఎం బాషా అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో 'రైతును ముంచుతున్న పాలకుల విధానాలు' పుస్తకాన్ని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, 'విద్వేష రాజకీయాలు' పుస్తకాన్ని ఆచార్య రాచపాళెం, 'అసమానతలు.. ఆర్థిక విధానాలు' పుస్తకాన్ని బడ్జెట్ విశ్లేషకుడు సత్యబోస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాచపాళెం మాట్లాడుతూ.. ప్రశ్నించడమే నేరమైపోతున్న రాజకీయ వ్యవస్థలో నిజాన్ని నిర్భయంగా చెప్పడమే పెద్ద సాహసమైందని అన్నారు. ఎన్నికల సమయంలో అసాధారణ హామీలు ఇచ్చి, అధికారంలోకి రాగానే ప్రజల్ని అణచివేయడం పాలకులకు అలవాటుగా మారిందని అన్నారు. ప్రజలంటే చులకన, సంపన్నులంటే ఆలింగనం అని రుజువు అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సందర్భంలో రాంభూపాల్ రోజువారీ ప్రజాసమస్యలపై ఉద్యమిస్తూనే, సమకాలీన ఆర్థిక రాజకీయ, సామాజిక పరిస్థితులపై అనేక వ్యాసాలు రాస్తున్నారని అన్నారు. మార్పు రావడం అంటే పార్టీలు, ప్రభుత్వాలు మారడం కాదని, అవి అనుసరించే విధానాలు మారాలని తన రచనలద్వారా బలమైన ప్రత్యామ్నాయ అవసరాన్ని చాటిచెప్పారని అభినందించారు. వ్యవసాయ రంగంలో కేంద్ర ప్రభుత్వం తెస్తున్న చట్టాలు, కార్పొరేట్ అనుకూల విధానాలు మన జిల్లా రైతులపై చూపే దుష్ప్రభావాన్ని రాంభూపాల్ కళ్లకు కట్టినట్లు చూపించారని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. నీటికోసం ఒకవైపు జనం ఎదురుచూస్తుంటే.. మరోవైపు పాలకుల నిర్లక్ష్యం వల్ల వందల టీఎంసీల నీరు వృథాగా సముద్రంలో కలిసిపోతోందని అన్నారు. గిట్టుబాటు ధరలు అందని రైతాంగం అప్పుల్లో కూరుకుపోతుంటే, దళారులు సంపన్నులవుతున్న తీరును రాంభూపాల్ తన రచనల్లో సమగ్రంగా వివరించారని అన్నారు. దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలు అత్యధికమంది ప్రజల జీవితాలను దుర్భరం చేస్తున్నాయని సత్యబోస్ అన్నారు. ఓవైపు దేశం అభివృద్ధి చెందిందని అంటున్నారని, మరోవైపు పేదలు సంక్షేమ పథకాలకోసం పేదలు ఎగబడుతున్నారని.. పాలకుల మాటలకు, ఆచరణకు ఉన్న వ్యత్యాసాన్ని ఇవి కళ్లకు కడుతున్నాయని అన్నారు. దళితులు, బలహీన వర్గాలవారి జీవితాలు ఎలా దుర్భరమవుతున్నాయో రాంభూపాల్ తన రచనల్లో సోదాహరణంగా వివరించారని అన్నారు. యువత, విద్యార్థులు ఈ పుస్తకాలను విస్తృతంగా అధ్యయనం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు ఓబులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్, న్యూడెమోక్రసీ నాయకులు ఏసురత్నం, అడ్వకేట్ రామకృష్ణారెడ్డి, తరిమెల అమరనాథరెడ్డి, చంద్రశేఖర్, జయరామప్ప, శేకన్న, గోవిందరాజులు, నబీరసూల్, కేవీ రమణ, రాంకుమార్, డాక్టర్ ప్రసూన, వేణుగోపాల్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నల్లప్ప, సావిత్రి, నాగేంద్ర, బాలరంగయ్య, నగర కార్యదర్శి రామిరెడ్డి, ఆర్వీ నాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.


'అసమానతలు.. ఆర్థిక విధానాలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బడ్జెట్ విశ్లేషకుడు సత్యబోస్ తదితరులు

ఖననానికి కష్టాలెన్నో..!



◆ పూడ్చడానికి ఆరు అడుగులూ కరువే
◆ ధర్మవరం శ్మశాన వాటికలో సమస్యలు

సమాధుల మధ్యలో నిల్వ ఉన్న మురుగునీరు

ధర్మవరం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మృతదేహాన్ని పూడ్చడానికి ఆరు అడుగుల స్థలం కోసం ఆ శ్మశాన వాటికలో వెతకలాట తప్పడం లేదు. ఎంత గాలించినా.. ఖాళీ స్థలం కనిపించని పరిస్థితి. చివరికి పూడ్చిన చోటే మళ్లీ కొత్తవాటిని పూడ్చాల్సిన పరిస్థితి నెలకొంది. ధర్మవరం పట్టణంలోని శ్మశాన వాటిక దుస్థితి ఇది. పట్టణం లో అనంతపురానికి వెళ్లే రహదారి పక్కన హిందూశ్మశాన వాటిక ఉంది. శతాబ్దాల క్రితం ధర్మవరం పట్టణం ఏర్పడినప్పుడు కేటాయించిన శ్మశానవాటిక స్థలంలోనే నేటికీ మృతదేహాలను పూడ్చుతున్నారు. ప్రస్తుతం పట్టణంలో దాదాపు 1.50 లక్ష దాకా జనాభా ఉంది. ఇందులో ముస్లింలు, క్రిస్టియన్స్ పోగా మిగిలిన వారందరూ ఈ శ్మశాన వాటికలోనే అత్యక్రియలు నిర్వహిస్తుంటారు. అయితే ఈ శ్మశానంలో స్థలం కొరత తీవ్రంగా ఉంది. దీంతో పూడ్చిన చోటే.. మళ్లీ గుంతలు పూడ్చి మృతదేహాలను పూడ్చుతున్నారు. ఏటా దసరా పండుగ నేపథ్యంలో పెద్దల పండుగ పేరుతో తమవారి సమాధులకు పూజలు నిర్వహిస్తుండటం



ఆగిపోయిన బర్నింగ్ మెషీన్ షెడ్ నిర్మాణం

ఆనవాయితీ. అయితే స్థలం కొరత వల్ల పాత సమాధులు తొలగించి.. కొత్తగా సమాధులు కడుతుండటంతో వారు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. శ్మశానికి మరింత స్థలం కేటాయించాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులను విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని పట్టణ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● సమస్యలు అనేకం

పట్టణంలోని శ్మశాన వాటికలో అనేక సమస్యలు తిష్ట వేశాయి. ఉన్న కాస్త శ్మశాన స్థలమూ సరిగా లేదు. ఎగువ ప్రాంతాల నుంచి మురుగునీరు సమాధుల మధ్యలో నిల్వ ఉంటోంది. ఐదేళ్లక్రితం గుట్టకిందపల్లిలో శ్మశాన వాటికక కోసం స్థలాన్ని పరిశీలించారు. మరీ ఇంతవరకు దాని గురించి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపలేదు. శ్మశాన వాటికలో బర్నింగ్ చేసే మిషన్ మూడు రోజుల నుంచి పనిచేయలేదు. ఆరేళ్లక్రితం బర్నింగ్ చేయడానికి ప్రత్యేకంగా షెడ్ కోసం రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. అయితే షెడ్ నిర్మాణాన్ని సగం వరకు నిర్మించి ఆపేశారు. ఆ తర్వాత దాని గురించి ఎవరూ పట్టించుకోలేదు. శ్మశాన వాటిక ప్రహరీ కూడా పడిపోయింది. దీంతో శ్మశాన వాటికలోకి పందులు, కుక్కలు ప్రవేశించి సమాధులను తోడేస్తున్నాయి.

స్థలాన్ని కేటాయించండి



శ్మశాన వాటకలో స్థలం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శ్మశాన వాటిక స్థలం సరిపోవడంలేదు. ఉన్న సమాధులను తొల గించి.. కొత్తగా మృతదేహాలను ఖననం చేస్తున్నారు. శ్మశాన వాటిక స్థలం విషయాన్ని పదేళ్ల నుంచి అన్ని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులకు విన్నవించాం. అయినా ఎవరూ పట్టించుకోలేదు.

- వెంకటేశ్, శ్మశాన వాటిక ఇన్‌చార్జ్, ధర్మవరం

పాత సమాధులను తొలగిస్తున్నారు



శ్మశాన వాటికలో ఖననం చేయడానికి స్థలంలేదు. పూడ్చిన చోటే.. మరిన్ని మృతదేహాలను పూడ్చుతున్నారు. పాత సమాధులను తొలగించి.. కొత్త వాటిని నిర్మిస్తున్నారు. పెద్దల పండుగ నాడు వారి సమాధుల వద్ద కనీసం పూజలు కూడా చేసుకోలేక పోతున్నాం. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి స్థలాన్ని కేటాయించాలి.

-రాజగోపాల్, మారుతీనగర్, ధర్మవరం

న్యూస్ బాక్స్..

రేపు హాకీ జట్ల ఎంపిక పోటీలు

ధర్మవరం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో ఆదివారం ఉదయం 9గంటలకు సత్యసాయి జిల్లా సబ్ జూనియర్, జూనియర్ బాలుర హాకీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు హాకీ రాష్ట్ర సంఘం వైస్ ప్రెసిడెంట్, సత్యసాయి జిల్లా సంఘం సెక్రటరీ బంధనాధం సూర్యప్రకాశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్ తీసుకురావాలని సూచించారు. సబ్‌జూనియర్ బాలుర జట్టుకు ఎంపికైన వారు జనవరి 17 నుంచి 20 వరకు మదనపల్లిలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన జూనియర్ బాలురకు పోటీలు నిర్వహించే ప్రాంతాన్ని త్వరలో ప్రకటిస్తామన్నారు.

పద్మశాలీయ సభ్యుల సమావేశం

ధర్మవరం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెండేయ కల్యాణమండపంలో పద్మశాలియ సంఘం నూతన కార్యవర్గం మొట్టమొదటి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆ సంఘం ప్రెసిడెంట్ పుత్తారుద్రయ్య, వైస్ ప్రెసిడెంట్ జింకానాగభూషణం మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం కార్యదర్శి మెడికల బాల కుళ్లాయప్ప, కోశాధికారి వడకల భాస్కర్, సహాయ కార్యదర్శులు పోలంకి వెంకటరామయ్య, భూదారపు శ్రీనివాసులు, పోలంకి లక్ష్మీనారాయణ, సుమారు 250 మంది కుల పెద్దలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

నంబులపూలకుంట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలం లోని ఎదురు దొన గ్రామంతో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆ గ్రామస్థులు ఇన్‌చార్జీ తహసీల్దార్ దేవేంద్రనాయక్‌ను కోరారు. శుక్రవారం ఆ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వినతి పత్రం అందజేశారు. అత్యవసర సమయంలో మండల కేంద్రంలోని ఆస్పత్రికి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటోందని, గ్రామంలోని విలేజీ హెల్త్ క్లీన్ ఏర్పాటు చేయాలని కోరారు. పాము, కుక్కకాటులకు వ్యాక్సిన్ అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ సదస్సులో 22 వినతులు వచ్చినట్లు ఇన్‌చార్జీ తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వీఎస్ శర్మ, సర్పంచ్ మునీశ్వర్‌నాయుడు, సర్వేయర్ జిలాన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై ర్యాలీ



ధర్మవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు, సభ్యులు

ధర్మవరం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హక్కులపై పట్టణంలో అవగాహన ర్యాలీని ఆర్డీఓ మహేశ్ శుక్రవారం నిర్వహించారు. జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది, వినియోగదారుల సంఘ సభ్యులు, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన పెంచుకో వాలన్నారు. ఈ ర్యాలీలో తహసీల్దార్ సురేశ్‌బాబు, వినియోగ దారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోలా ప్రభాకర్, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రశాంతి, బాలుర ఉన్నతపాఠశాల హెచ్ఎం శైలజ, వినియోగదారుల సంఘం పట్టణ అధ్యక్షుడు కుళ్లాయప్ప, కోశాధికారి రవీంద్ర, గౌరవాధ్యక్షుడు గోవిందు,సభ్యులు పాల్గొన్నారు.

కార్గో ప్రచార మాసోత్సవాలు

ధర్మవరం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలో కార్గో డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవాన్ని డిపో మేనేజర్ సత్యనారాయణ శుక్రవారం ప్రారంభించారు. ఆర్టీసీ ఉద్యోగు లందరూ కార్గో డోర్ డెలివరీపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని సూచించారు. ఈ ప్రచార మాసోత్సవాన్ని వచ్చే నెల 19వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీఐ-3 శ్రీరాములు, సిబ్బంది పాల్గొన్నారు.

● కదిరి అర్బన్ : ఆర్టీసీ కార్గో డోర్ డెలవరీ మాసోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను స్థానిక డిపో మేనేజర్ మైనోద్దీన్ శుక్రవారం విడుదల చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌చార్జ్ పెద్దన్న, కార్గో సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ఎన్ఎంయుఎ, జైబీమ్ నాయకులు, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.



ధర్మవరంలో మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం

ఆర్టీసీ ఉద్యోగులకు పాత పద్ధతిలోనే

వైద్య సౌకర్యాలు కల్పించాలి

పుట్టపర్తి టౌన్ : ఆర్టీసీ ఉద్యోగులకు పాత పద్ధతిలోనే వైద్య సౌక ర్యాలు కల్పించాలని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రావు.. ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం జిల్లాలోని ఆరు డిపోలకు చెందిన ఈయూ నాయకులతో పుట్టపర్తిలో సమావేశం నిర్వహించారు. దామోదర్‌రావు మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగుల కు ఉద్యోగ భద్రత కల్పిం చాలన్నారు. 2019లో టీడీపీ పాలనలో సాధించుకున్న సర్క్యులర్ నంబర్ 1ని అమలు చేయాలన్నారు. దీనిపై రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీకి విన్న వించామన్నారు. వారి ఆదేశాలను కిందిస్థాయి అధికారులు అమ లు చేయకుండా ఇబ్బందులు పెట్టడం తగదన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, కార్యదర్శి జీవైపీ రావు, ఆరు డిపోల అధ్యక్షులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రావు

సమాచారమే తప్పు..!

'సమాచార హక్కు చట్టం' బోర్డులో మారని సమాచారం

ముదిగుబ్బ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలన గురించి.. పథకాల అమలు.. నిధుల కేటాయింపు.. తదితర విషయాలపై పూర్తి.. ఖచ్చితమైన సమాచారం పొందేందుకు సమాచార హక్కు చట్టాన్ని రూపొందించారు. సమాచారం కావాల్సిన వారు సంప్రదించాల్సిన అధికారుల పేరు.. వారి సెల్ సెంబర్‌ను ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. అయితే ఆ సమాచారమే తప్పు ఉంటే.. ఇక ప్రజలు ఎవరిని అడగాలి. స్థానిక రెండో సచివాలయంలో ఈ పరిస్థితి ఉంది. విస్తరణాధికారి రెండు సంవత్సరాల క్రితం బదిలీపై వెళ్లారు. కార్యదర్శి గత ఏడాది బదిలీపై వెళ్లారు. అయినా ఆ అధికారుల పేర్లే సమాచార హక్కు చట్టం బోర్డులో ఉన్నాయి. దీంతో సమాచారం కోసం ఎవరిని అడగాలో తెలియక ప్రజలు తీవ్ర తికమక పడుతున్నారు. ఇప్పటికైనా సమాచార హక్కు చట్టం బోర్డులోనైనా సమాచారం కరెక్టుగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



సమాచార హక్కు చట్టం బోర్డులో ఉన్న పాత సమాచారం



అయ్యప్పస్వామి గ్రామోత్సవం

బుక్కపట్నం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని శుక్రవారం అయ్యప్ప మాలధారులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం కన్యపూజ, గణపతి పూజ నిర్వహించారు. అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి ప్రత్యేక వాహనంలో అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. అయ్యప్ప మాలధారులు గీతాలు ఆలపిస్తూ.. నృత్యాలు చేస్తూ.. ఈ గ్రామోత్సవంలో పాల్గొన్నానను. డప్పువాయిద్యాలు, మేళతాళాల మధ్య చిన్నారులు దీపాలు చేతభూని తిరువీధుల్లో ఈ ఊరేగింపును చేపట్టారు.

పురవీధుల్లో ఊరేగింపుతున్న అయ్యప్ప

పరుగు పందెంలో

ఎస్ఐ ఫస్ట్



తనకల్లు : పుట్టపర్తిలో ఎస్పీ రత్న ఆధ్వర్యంలో పోలీసులకు క్రీడాపోటీలను నిర్వహిస్తు న్నారు. ఇందులో 100, 400 మీటర్ల పరుగు పందెంలో స్థానిక ఎస్ఐ గోపి మొదటి స్థానం సాధిం చారు. శుక్రవారం ఎస్పీ ఆయనకు ప్రసంసాపత్రంతో పాటు బహుమతిని అందజేశారు.

'సత్యసాయి' వైద్యసేవలు అమోఘం

రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కితాబు

పుట్టపర్తి రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సత్యసాయి సూపర్ స్పెషా లిటీ ఆస్పత్రి పేదలకు అందిస్తున్న ఆధునాతన వైద్యసేవలు అమోఘమని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీఎంఎస్ ప్రసాద్ కొనియాడారు. శుక్రవారం బొంబాయి నుంచి ప్రత్యేక విమానంలో పుట్టపర్తి శ్రీసత్యసాయి ఎయిర్ పోర్టుకు ఆయన చేరుకున్నారు. ఆయన మొదట ప్రశాంతి నిలయంలో శ్రీసత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని పరిశీలించారు. శ్రీసత్యసాయి సెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ హాస్పిటల్‌లో పేదలకు అందిస్తున్న వైద్య సేవలను ఆయనకు వివరించారు. అత్యాధునిక వైద్య పరికరాలను చూపించారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ.. సత్యసాయి శివైక్యం తర్వాత బాబావారి అడుగుజాడల్లో సత్యసాయిసెంట్రల్ ట్రస్టు నడుస్తూ.. పేదలకు అత్యంత ఖరీదైన వైద్యసేవలను పూర్తీ ఉచితంగా అందించడం అమోఘమని కొనియాడారు. ఆయన వెంట పలువురు రిలయన్స్ ప్రతినిధులు, హాస్పిటల్ జాయింట్ డైరెక్టర్ అనిల్‌కుమార్ మెక్‌పూర్, సత్యసాయిసేవాసంస్థల కో-ఆర్డినేటర్ కోటేశ్వరరావు, చీఫ్ ఇంజనీర్ హరనాథ్ ఉన్నారు.



రత్నాకర్‌తో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డెరెక్టర్ ప్రసాద్

సమన్వయంతోనే అభివృద్ధి: ఎంపీడీఓ

నల్లచెరువు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీపీడీఓ కార్యాల యంలో ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమా వేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎంపీపీ రమణారెడ్డి మాట్లాడుతూ... అధికారుల, ప్రజాప్రతినిధుల సమ్వయంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రవినాయక్, వైద్యాధికారి కల్పన, ఏఓ భారతి, ఎంఈఓ తిరుపాల్‌నాయక్, హౌసింగ్ ఏఈ విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ కవిత, ఇరిగేషన్ ఏఈ ఆదెమ్మ, ఈఓఆర్డీ శంకులబాయి, ఎంపీటీసీలు, అధికారలుఉ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● చెత్త సంపద కేంద్రం పరిశీలన

స్థానిక చెత్త సంపద కేంద్రాన్ని ఎంపీడీఓ పరిశీలించారు. కేంద్రంలో చెట్లపెంపకాన్ని పరిశీలించిన ఆయన నిర్వాహకురాలు ప్రభావతిని అభినందించారు. అన్ని పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలని కార్యదర్శులు, కార్మికులకు సూచించారు. ఆయన వెంట సర్పంచ్ పంచరత్నమ్మ, అల్లుగుండు, జోగన్నపేట, నల్లచెరువు పంచాయతీ కార్యదర్శులు నరేష్, విజయ్‌కుమార్ ఉన్నారు.

ఆలయానికి సామగ్రి అందజేత

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంకొత్తపల్లిలో అయ్యప్ప స్వామి ఆలయానికి అమడగూరు మండలానికి చెందిన రాము విద్యుత్‌దీపాలు, కదిరికి చెందిన కాంట్రాక్టర్ రాంబాబు వంట సామగ్రి అందించినట్లు ఆలయ సంకల్పకులు పచ్చర్ల ఆంజనే యులనాయుడు శుక్రవారం తెలిపారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజైన శుక్రవారం స్వామివారిని గరుడ వాహనంపై ఎం.కొత్తపల్లి, వడ్డివారిపల్లి, ఓడీచెరువు పురవీధుల్లో ఊరేగించినట్లు చెప్పారు.

తహసీల్దార్ కార్యాలయానికి కంప్యూటర్ వితరణ

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని తహసీ ల్దార్ కార్యాలయానికి రూ. 50వేలు విలువ చేస్తే కంప్యూటర్‌ను మండల డీలర్ల సంఘం సభ్యులు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరెడ్డికి శుక్రవారం అందచేశారు. కార్యక్రమంలో డీలర్ల సంఘం నాయకులు రాజారెడ్డి, ఆర్పీ, సౌదీ నాగరాజు, జెరిపిటి అంజనప్ప, నాగరాజు పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్‌కు కంప్యూటర్ అందచేస్తున్న డీలర్లు

క్రైం న్యూస్....

వాహనం బోల్తా

బత్తలపల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం గ్రామంలో బొలెరో వాహనం బోల్తా పడిన ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ధర్మవరానికి చెందిన చితంబరం, రంగా మొద్దుల వ్యాపారం చేస్తున్నారు. శుక్రవారం ముదిగుబ్బ సమీపంలో మొద్దులు కోసుకోని కూలీలతో బొలెరో వాహనంలో బయలుదేరారు. రామాపురం వద్దకు రాగానే టైరు పగలడంతో బొలెరో వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కూలీలు ముత్యలప్ప, గంగప్ప, కదిరెప్ప తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108లో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. ముత్యప్ప పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేస్ నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

అంబేడ్కర్‌పై అనుచిత వాఖ్యలు తగదు

కదిరి అర్బన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): డాక్టర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిషా అనుచిత వాఖ్యలు తగదని కాం గ్రెస్, బీఎస్పీ నాయకులు మండిపడ్డారు. శుక్రవారం పట్టణం లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వేరువేరుగా ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మోహన్‌గాంధీ, ఇందాదు ల్లాఖాన్, కదిరప్ప, బీఎస్పీ నాయకులు ఇర్ఫాన్ పాల్గొన్నారు.

కల్వర్టు తెగి ఏడాదైనా..

ముదిగుబ్బ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాపు రం క్రాస్ నుంచి బుక్కపట్నం మండలానికి వెళ్లే మార్గ మధ్యలో... నల్లచెరువులోపల్లి సమీపంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. సంవత్సరం క్రితం కురిసిన వర్షాలకు గుంజెపల్లి చెరువు మరువ పారి కల్వర్టు కొట్టుకుపోయింది. దాంతో తాత్కాలికంగా సిమెంట్ పైపులు వేసి.. పైన మట్టి వేసి.. తాత్కా లికంగా కల్వర్టును ఏర్పాటు చేశారు. గత నెలలో కురిసిన వర్షాలకు సిమెంట్ పైపులపై .. అంచుల వద్ద ఉన్న మట్టి కొట్టుకు పోయింది. ఆ పైపులు శిథిలావస్థకు చేరుకున్నారు. ఈ మార్గంలో రోజూ వందలాది వాహనాలు వెళ్తుంటాయి. ప్రస్తుతం దానిపై ఆటోల్లో వెళ్లడానికి కూడా ప్రజలు భయపడుతున్నారు. కల్వర్టు కొట్టుకుపోయి ఏడాది కావస్తున్నా... నేటికి శాశ్వత పరిష్కారం చూపలేదు. ఈ కల్వర్టు రోడ్డు మలుపు వద్ద ఉండటం.. కనీసం రక్షణ దిమ్మెలు కూడా లేకపోవడంతో రాత్రి వేళల్లో వాహనదారులు మరీ ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి.. శాశ్వత కల్వర్టును నిర్మించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న తాత్కాలిక కల్వర్టు

మృతులకు నివాళి

నల్లమాడ/ఓబుళదేవరచెరువు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): నల్లమాడలో ప్రమాదవశాత్తు జారిపడి షామీర్‌బాషా మరణించిన విషయం తెల్సిందే. శుక్రవారం ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి నివాళులర్పించారు. నల్లమాడలో నివాసముంటున్న విశ్రాంత టీచర్ నరసింహులు భార్య సరస్వతమ్మ అనారోగ్యంతో మరణించడగా.. ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. నల్లమాడ మండలం బండవాండ్లపల్లిలో వెంకట రాముడు మరణించడగా.. ఆయన మృతదేహానికి నివాళుర్పించారు. అలాగే ఓబుళదేవరచెరువు మండలంలోని గౌనిపల్లిలో టీడీపీ కార్యకర్త రమేష్ తల్లిక్రిష్టమ్మ మరణించడంతో ఆమె మృతదేహానికి ఎమ్మెల్యే, మాజీ మంత్రి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్థిక సాయం అందజేశారు.

బీమా చేయించుకోండి

గాండ్లపెంట : రబీలో సాగుచేసిన పంటలకు వాతావరణ బీమా చేయించుకో వాలని ఏఓ లక్ష్మీప్రియ శుక్రవారం తెలిపారు. రైతులు మీసేవా కేం ద్రంలో ప్రీమియం చెల్లించాలని, ఈనెలాఖ రు వరకు గడువు ఉందని అన్నారు.

క్రికెట్ పోటీల్లో రన్నర్‌గా 'కదిరి'

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ అంతర్‌కళాశాల క్రికెట్ పోటీల విన్నర్‌గా ఎస్ఎస్‌బీఎన్ జట్టు, రన్నర్‌గా కదిరి బ్లూమూన్ కాలేజీ జట్టు నిలిచాయి. ఎస్కే. యూనివర్సిటీ అంతర్‌కళాశాలల క్రికెట్ పోటీలలో భాగంగా శుక్రవారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఈ జట్ల మధ్య ఫైనల్ పోటీ నిర్వహించారు. ఎస్ఎస్‌బీఎన్ నిర్ణీత 25ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 259పరుగులు చేసింది. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన కదిరి బ్లూమూన్ జట్టు 25ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 169పరుగులు మాత్రమే చేసింది. దీంతో ఎస్ఎస్‌బీఎన్ 90పరుగుల తేడాతో విజయం సాధించి ట్రోఫీ కైవసం చేసుకుంది.



రన్నర్‌గా నిలిచిన కదిరి బ్లూమూన్ డిగ్రీ కాలేజీ జట్టు

అక్రమ కొళాయిలతో
రూ.5 కోట్లకు గండి





అక్రమ కొళాయిలను గుర్తిస్తున్న సిబ్బంది

- బయటపడుతున్న వైసీపీ పాపాలపుట్ట
- ఐదేళ్లలో మునిసిపాలిటీలో అక్రమ కొళాయిలు
- వేలల్లో కనెక్షన్లు ఇప్పించిన వైసీపీ కౌన్సిలర్లు
- స్పెషల్ డ్రైవ్‌తో వెలుగులోకి

హిందూపురం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నానెప్పనగర్‌లో ఓ అపార్ట్‌మెంట్‌కు అక్రమంగా కొళాయి కనెక్షన్ ఏర్పాటు చేసుకున్నారు. అయితే గత వైసీపీ కాలంలో ఇందుకోసం ఆ ప్రాంతంలోని కౌన్సిలర్, భవన యజమాని నుంచి సుమారు రూ.2లక్షలకుపైగా దండుకున్నట్టు తెలుస్తోంది. అందులో కొంత మొత్తం ఫిట్టర్‌కు ఇచ్చి కొళాయి ఏర్పాటుచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మునిసిపల్ అధికారులు గుర్తించి అందుకు జరిమానా విధించి కొళాయి డబ్బు చెల్లించేలా చేశారు. ముద్దిరెడ్డిపల్లిలోని ఓ వైసీపీ కౌన్సిలర్ ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంలో ఓ పెద్ద భవంతి నిర్మించారు. అయితే ఆ భవన యజమాని మునిసిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతి పొందలేదు. ఎందుకంటే ఆ భవనానికి సంబంధించి లీగల్‌గా ఇబ్బందులు ఉండటంతోపాటు వ్యాపార సముదాయం కోసం నిర్మించారు. దీంతో మునిసిపాలిటీకి వెళ్తే కొళాయి కనెక్షన్ రాదని స్థానిక వైసీపీ కౌన్సిలర్‌కు రూ.లక్షకుపైగా ఇచ్చినట్లు సమాచారం. ఫిట్టర్‌కు కూడా కొంత మొత్తం అందించారు. దీంతో ఆభవంతికి కొళాయి ఏర్పాటు చేశారు. కానీ మూడు నెలల క్రితం మునిసిపల్ అధికారి దీనిని గుర్తించారు. అదేవిధంగా పట్టణంలోని బెంగళూరు రోడ్డుకు పడమర వైపున అపార్ట్‌మెంట్ నిర్మించారు. దానికి ఇంచి, ఒకటిన్నర ఇంచి పైపులు ఏర్పాటు చేశారు. అయితే సంబంధిత వైసీపీ కౌన్సిలర్‌కు ఇందుకుగాను రూ.3లక్షలకుపైగా చెల్లించినట్లు తెలుస్తోంది. హిందూపురంలో ఇలాంటివి వేలల్లో ఉన్నాయి. ప్రస్తుతం స్పెషల్ డ్రైవ్ పేరుతో కొరడా ఝుళిపిస్తున్నారు. దీంతో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు చేసిన పాపాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి.

ఐదేళ్లుగా అక్రమ కొళాయిలు ఏర్పాటు

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో హిందూపురం మునిసిపాలిటీని, అందులో నీటి విభాగాన్ని కల్పవృక్షంగా మార్చుకున్నారు. కొత్త భవనం కట్టాలంటే అనుమతుల నుంచి నీటి కొళాయి ఏర్పాటు వరకు నాయకులే చూసేవారు. ఈ నేపథ్యంలో అక్రమ కొళాయిలు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఒక్కో కొళాయి ఏర్పాటుకు రూ.50 నుంచి రూ.లక్ష దాకా దండుకున్నట్లు సమాచారం. ఎందుకంటే మునిసిపాలిటీకి నివాస భవనానికైతే రూ.10వేలు, వ్యాపార సముదాయానికైతే రూ.20వేలు చెల్లించాలి. అనుమతులు రావడానికి ఆలస్యం అవుతుందని చెప్పి వైసీపీ కౌన్సిలర్లు ఫిట్టర్‌తో భాగస్వామ్యం చేసుకుని అక్రమంగా కొళాయిలు ఏర్పాటు చేశారు. దీనివల్ల అక్రమ కొళాయిల వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా ఐదేళ్లపాటు విరాజిల్లింది.

అనుమతులు లేకుండా 5వేల కొళాయిలు

హిందూపురం మునిసిపాలిటీలో 38వార్డులుండగా ప్రతి వార్డులో సుమారు 100 నుంచి 150 అక్రమ కొళాయి కనెక్షన్‌లు ఉన్నట్లు మునిసిపల్ అధికారులు ఒక అంచనాకు వచ్చారు. ఈ లెక్కన హిందూపురం పట్టణంలో రూ.5వేల కొళాయిలతో నీటి చౌర్యం చేస్తున్నట్లు సమాచారం. దీంతో మునిసిపాలిటీకి కొళాయికి 10వేల చొప్పున లెక్కించినా రూ.5కోట్లు గండి పడినట్లు తెలుస్తుంది. హిందూపురంలోని మునిసిపాలిటీలో 25వేల కొళాయిలకు అనుమతులున్నాయి. ఒక్కో కొళాయికి ఏడాదికి రూ.1200 నీటిచార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. కానీ 5వేల కొళాయిలు అక్రమంగా ఉన్నట్లు గుర్తించారు. వీటివల్ల మునిసిపాలిటీకి ఏడాదికి డిపాజిట్ కాకుండా రూ.60లక్షలు గండి పడుతోంది. ఈ లెక్కన భావిస్తే ఐదేళ్లలో వైసీపీ పుణ్యమా అంటూ రూ.7నుంచి రూ.8కోట్లు నష్టం వచ్చింది. అయినా కొంతమంది వైసీపీ కౌన్సిలర్లు దీనిపై మాట్లాడటంలేదు. ఎందుకంటే అందులో వారి భాగస్వామ్యం ఉండటంవల్ల ఏ కౌన్సిల్ సమావేశంలోనూ చర్చించిన దాఖలాలులేవు.

స్పెషల్ డ్రైవ్‌తో వెలుగులోకి

ఇవన్నీ ఇలా ఉంటే అక్రమ కొళాయి కనెక్షన్‌లు మునిసిపల్ కమిషనర్ ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. అక్రమంగా ఏర్పాటు చేసిన కొళాయిలను గుర్తించాలని ఒక ఏఈ, ఐదారు సిబ్బంది వెళ్లి వార్డు వార్డు తిరుగుతున్నారు. ముద్దిరెడ్డిపల్లిలో అధికారులు తిరిగే సమయంలో పలుచోట్ల వ్యాపార సముదాయాలు మూడు నాలుగు అంతస్తుల భవంతులు నిర్మించుకున్నవారు సైతం అక్రమ కొళాయిలు ఏర్పాటు చేసుకున్నారు. దీనిని బట్టి అప్పట్లో వైసీపీ నాయకులు, ఫిట్టర్లు కలిసి ఈ దందాకు తెరలేపినట్లు అధికారులు గుర్తించారు. ఈ తరుణంలోనే దశాబ్దాల కాలంగా ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న ఫిట్టర్లను వేర్వేరు ప్రాంతాలకు బదిలీ చేయడంతో అక్రమ కొళాయిల వ్యవహారం ఇప్పుడిప్పుడే వెలుగు చూస్తోంది.

అక్రమ కొళాయిలు బయట పడుతున్నాయి

గతంలో హిందూపురం మునిసిపాలిటీలో అక్రమంగా కొళాయిలు ఏర్పాటు చేసుకున్నారు. అలాంటివారిని గుర్తించే పనిలో ఉన్నాం. ఇప్పటికే సిబ్బంది కనెక్షన్‌లు తొలగిస్తున్నారు. అక్రమ కొళాయి కనెక్షన్ ఉన్నవారు స్వచ్ఛందంగా తొలగించుకోవాలి. లేదా డిపాజిట్ సొమ్ము కట్టాలి. అలా చేయకుండా ఉంటే వారిపై చర్యలు తీసుకుంటాం.



శ్రీనివాసులు, కమిషనర్

క్లుప్తంగా..

విద్యార్థులకు మోడల్ పేపర్ల వితరణ



వానవోలులో మోడల్ పేపర్లను అందుకున్న విద్యార్థులు

గోరంట్ల, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వానవోలు ఉన్నత పాఠశాలలో పదవతరగతి చదువుతున్న 40 మంది విద్యార్థులకు రిటైర్డ్ హెచ్‌ఎం వెంకటరమణప్ప, యుటిఎఫ్ మోడల్ పేపర్లను శుక్రవారం పంపిణీ చేశారు. పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడానికి యుటిఎఫ్ రూపొందించిన మోడల్ పేపర్లను సొంత ఖర్చుతో అందచేశామన్నారు. దాత వెంకటరమణప్పను ఉపాధ్యాయులు శాలువా, పూలమాలతో సత్కరించారు. అదేవిధంగా గోరంట్లలోని బాలుర ఉన్నతపాఠశాలలో పదవతరగతి చదువుతున్న 110మంది విద్యార్థులకు తండ్రి, కొడుకులు రామయ్య, డాక్టర్ రవితేజాలు మోడల్ పేపర్లను శుక్రవారం అందించారు.

పెనుకొండ రూరల్: రొద్దం మండలంలోని చోళేమర్రి జెడ్పీహెచ్‌ఎస్‌లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు మోడల్ పేపర్లు పంపిణీ చేసినట్లు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్‌కుమార్ తెలిపారు.

అయ్యప్పలకోసం మైనార్టీ నాయకుడి వితరణ

గోరంట్ల, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సినీ మాథియేటర్ వద్దగల అయ్యప్పస్వామి ఆలయంలో మాల ధారులకోసం టీడీపీ మైనార్టీ సీనియర్ నాయకుడు అజంతుల్లా నాలుగుబస్తాల సన్నబియ్యాన్ని గురుస్వామి ఆదినారాయణకు శుక్రవారం అందచేశారు. గురుస్వామి ఆయనను ఆశీర్వదిస్తూ స్వామివారి ప్రసాదం అందచేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ అయ్యప్ప మాలధారులు ఎస్‌వినారాయణ, మామిడికాయల హరిప్రసాద్, దేవరకొండ ఉమాశంకర్, కార్తీక్, శ్రీనివాస్‌సింగ్ తదితరులున్నారు..

చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమే



పరుగు పందేలలో చిన్నారులు

హిందూపురం అర్బన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో విద్యార్థులకు చదువుతోపాటు ఆటపాటలతో కూడిన క్రమశిక్షణ, కరాటే, యోగా ఎన్‌సీసీ లాంటివి అవసరమని ఎంఈఓ గంగప్ప పేర్కొన్నాడు. పట్టణ పరిధిలోని టీచర్స్ కాలనీ లో ఉన్న జ్ఞాన జ్యోతి కిడ్స్ కార్నర్‌లో 8వ వార్షికోత్సవ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల విద్యార్థులు చురుగ్గా ఉంటారన్నారు. తల్లి దండ్రులు కూడా పోటీ ప్రపంచంలో చదువు ఒక్కటే ముఖ్యమని అనుకోకూడదని ఆటలు, నృత్యాలు, మ్యూజిక్ ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, కరాటే ఇలా ఎందులో పిల్లలకు మక్కువ ఉందో గ్రహించి అందులో తర్ఫీదు ఇప్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఛైర్మన్ బాలకృష్ణ, హెచ్‌ఎం సత్యకుమార్ ఉపాధ్యాయులు విద్యార్థులు వారి పిల్లలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి):పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని డి1 ఏఈ లక్ష్మీకాంత్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 33-11కేవి విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా పట్టణంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిల్పా నర్సింగ్ హోం, బాలాజీనగర్, ధన్‌రోడ్డు, సదాశివనగర్, అహ్మద్‌నగర్, సత్యసాయినగర్, వేంకటేశ్వర నగర్, విజయ్‌నగర్‌కాలనీ, భాగ్యనగర్, ముద్దిరెడ్డిపల్లి శివబాలయోగి ఆశ్రమప్రాంతం, అరవిందనగర్ ప్రాంతాల్లో విద్యుత్‌సరఫరా అంతరాయం ఉంటుందన్నారు.

నేడు అయ్యప్ప స్వామి మండలపూజ

హిందూపురం అర్బన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని శ్రీకంఠపురం లేపాక్షి మెయిన్ రోడ్డులో నెలకొన్న శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం మండలపూజా కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు శ్రీకంఠేశ్వర అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే ఆలయంలో మూల విరాట్‌కు వివిధ అభిషేకాలు, అర్చనలు అలంకరణ చేయనున్నామన్నారు. ఆలయప్రాంగణంలో హోమాలు, వివిధ పూజా కార్యక్రమాలు భజన, అన్నదానం చేయనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై హరిహరపుత్రుని కృపకు పాత్రులు కావాలని కోరారు.

చోళసముద్రం రెవెన్యూ సదస్సులో 50 అర్జీలు

లేపాక్షి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): చోళసముద్రం గ్రామంలో తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో సర్వే కోసం 3, పట్టాదారు పాసుపుస్తకం కోసం 15, అసైన్మెంట్ 3, క్యాస్ట్ కోసం 15 అర్జీలు అందినట్లు తెలిపారు. వినతులు పరిశీలించి వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు



సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి ఉష

సోమందేపల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముందస్తు జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్ ఆధ్వర్యంలో స్థానిక వైఎస్ఆర్ సర్కిల్‌లో ఉన్న విగ్రహానికి జగన్ ఫ్లెక్సీకి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం 30కేజీల కేక్‌ను కట్‌చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎప్పుడు ఎన్నికలొచ్చినా గెలిచేది వైసీపీ పార్టీయే నన్నారు. గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వచ్చే యేడాది మొదటి మాసంలో జగన్ జనంలోకి వస్తారన్నారు. కూటమి ప్రభుత్వం ఫెయిల్ అయిందన్నారు. సంక్షేమ పథకాలను చెప్పిన విధంగా అందించిన ఘనత జగన్‌దేనన్నారు. స్థానిక మంత్రి అవినీతి అక్రమాలకు పాల్పడుతుందని ఆరోపించారు. కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తే ఊరుకోమన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గజేంద్ర, జెడ్పీటీసీ అశోక్, రమాకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి సమస్యను వెంటనే పరిష్కరించాలి

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి):కాలనీలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని 13, బేగార్లపల్లి 19వ వార్డులలో విస్తృతంగా పర్యటించారు. నెలకొన్న అపరిశుభ్రత తొలగించకపోతే సమస్యలు మరింత ఉత్పన్నమవుతాయన్నారు. ఇలా ఉంటే సీజనల్ వ్యాధులతోపాటు ప్రజలు ఇబ్బందులు పడరా? అంటూ ప్రశ్నించారు. వార్డులలో తాగునీటి సమస్య, పారిశుద్ధ్యం, వీధి దీపాల ఏర్పాటు వంటివి వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. కాలనీల్లో పర్యటించిన సందర్భంగా ప్రజలు సైతం పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే వాటిని పరిష్కరించేలా అధికారులకు సూచనలు చేశారు. ఈసందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, నియోజకవర్గం మీడియా కోఆర్డినేటర్ రవికుమార్, కౌన్సిలర్లు బలరాం, ఉమాశంకర్, రమేష్, డాక్టర్ సెల్ అధ్యక్షులు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

శాంతి హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

పట్టణంలోని దండిమారమ్మ దేవస్థానంలో శుక్రవారం నిర్వహించిన శాంతి హోమం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



శాంతి హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

అమ్మవారికి నూతనంగా ప్రవేశతోరణం నిర్మించడంతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే అమ్మవారికి విశేష అర్చనలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

నూతన పద్ధతులతోనే లాభదాయక వ్యవసాయం



మాట్లాడుతున్న రామసుబ్బయ్య

చిలమత్తూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): నూతన పద్ధతులను అవలంబించడంతోనే వ్యవసాయంలో లాభాలు పొందవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారుల డివిజన్ స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి హిందూపురం ఏడిఏ అల్తాఫ్ అలీ ఖాన్, డాట్ సెంటర్ వ్యవసాయ శాస్త్రవేత్త రామసుబ్బయ్య, ఏపీఎంఐ పీడీ సుదర్శన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయంలో పాత పద్ధతులు అవలంబించడం వలన పెట్టుబడులు పెరిగి, లాభాలు తగ్గుతున్నాయన్నారు. రైతులు సాంకేతికను ఉపయోగించుకుంటూ కొత్త పద్ధతులతో వ్యవసాయం చేయాలన్నారు. సీజనల్‌గా ఏ పంటలు అనుకూలమో వాటినే సాగుచేయాలని, మంచి వంగడాలను ఎంచుకోవాలని, రసాయనిక ఎరువులను తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగం పెంచుకోవాలన్నారు.

ఇకనైనా సత్ప్రవర్తనతో మెలగండి



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయాధికారి రాజ్యలక్ష్మి

హిందూపురం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జైలు జీవితం నుంచి బయటికి వెళ్లాక సత్‌ప్రవర్తనతో మెలగాలని ఖైదీలకు న్యాయాధికారి సూచించారు. శుక్రవారం స్థానిక సబ్ జైలును జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి రాజ్యలక్ష్మీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలకు అందుతున్న ఆహారం, పరిసరాల పరిశుభ్రతపై ఆరాతీశారు. ఏయే కేసుల్లో నిందితులుగా ఉన్నారు, ఎప్పటి నుంచి ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. ఒక్కసారి జైలుకు వచ్చాక వారి కుటుంబం ఆర్థికంగా చితికిపోవడమే కాక కుటుంబ సభ్యులు తలెత్తుకుని తిరగలేరన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని మంచిగా మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆస్పత్రి ఆవరణలో వ్యక్తి మృతి

మడకశిరటౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మడకశిర వైద్య విధాన పరిషత్ ఆస్పత్రి ఆవరణంలో జోగప్ప(60) అనే వ్యక్తి మృతి చెందారు. అమరాపురం మండలం నాగోనహళ్లి గ్రామానికి చెందిన జోగప్ప మడకశిర పట్టణానికి పని నిమిత్తం వచ్చి కడుపునొప్పి రావడంతో మడకశిర ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో విశ్రాంతి తీసుకొంటుండగా మృతి చెందాడు. మృతదేహాన్ని ఆస్పత్రి సిబ్బంది అప్పగించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పోలీసుల అదుపులో ద్విచక్రవాహనాల దొంగలు

లేపాక్షి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాల దొంగతనాలకు అలవాటుపడ్డ ఇద్దరు విద్యార్థులను స్థానిక పోలీసులు గురువారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. లేపాక్షి ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి గురువారం ద్విచక్రవాహనాన్ని దొంగలించడం ప్రత్యక్షంగా చూసినట్లు ఫిర్యాదుదారులు తెలిపారని పోలీసులు తెలిపారు. ఇదే పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న మరో విద్యార్థి కూడా ఇందులో ఉన్నట్లు గుర్తించామన్నారు. అయితే ఆ విద్యార్థి కేవలం తానుపాఠశాల వరకు డ్రాప్ అడిగానేతప్ప ఇందులో తన ప్రమేయం లేదని తెలిపాడని ఇద్దరిని విచారించిన తరువాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

కారు.. ద్విచక్రవాహనం ఢీ

పరిగి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): కొడికొండ -శిర హైవేలో యర్రగుంట సమీపంలోని రెయిన్‌బో పాఠశాల వద్ద కారు, ద్విచక్రవాహనం ఢీకొని ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు మడకశిర వైపు నుంచి వస్తున్న కారు టైరు పంచర్ కావడంతో ఒక్కసారిగా అదుపుతప్పి ఊటకూరు వైపు నుంచి వస్తున్న అబూబ్ అనే యువకుడి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో అబూబ్‌కు తీవ్రగాయాలుకాగా హుటాహుటిన అతడిని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వాహనం అదుపుతప్పి తాపీ మేస్త్రీ మృతి

గోరంట్ల, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాతీయ రహదారిపై పాలసముద్రం కోళ్ల ఫారం వద్ద ద్విచక్రవాహన ప్రమాదంలో తాపీ మేస్త్రీ వడ్డె హరి(42) శుక్రవారం మృతి చెందాడు. కాటేపల్లి ఆదినారాయణప్ప కుమారుడు వడ్డె హరి భార్య వరలక్ష్మీ, కుమార్తె, కుమారుడుతో హిందూపురంలో నివాసముంటున్నాడు. తల్లి నారాయణ స్వగ్రామమైన కాటేపల్లిలో ఉంటోంది. హరి స్వగ్రామానికి వచ్చి తల్లిని పలకరించి, ద్విచక్రవాహనంపై చెక్‌పోస్టు వైపు వెళ్తుండగా కోళ్లఫారం వద్ద రోడ్డుపై పడి మృతిచెందారు. ద్విచక్రవాహనం దెబ్బతినకపోవడంతోపాటు రోడ్డుపై పడిన గుర్తుల ఆధారంగా వాహనం అదుపు తప్పి ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ప్రమాదంలో తల రోడ్డుకు తగలడంతో అక్కడిక్కడే మృతిచెందారు. ఎస్‌ఐ బాబు సంఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బొగ్గుల లారీ, కారు ఢీ

సిక్కిం మహిళకు తీవ్రగాయాలు

గోరంట్ల, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి):హిందూపురం ప్రధాన రహదారిలో కొత్తపల్లి క్రాస్ సమీపంలో బొగ్గుల లారీ కారును ఢీకొనడంతో సిక్కింకు చెందిన రంజిత అనే మహిళ శుక్రవారం రాత్రి తీవ్రంగా గాయపడ్డారు. బొగ్గును తీసుకెళ్తున్న లారీ కొత్తపల్లి సమీపంలో ఎదురుగా వచ్చిన కారును ఢీకొని ఆపకుండా మల్లాపల్లి వద్ద విద్యుత్‌స్తంభాన్ని ఢీకొని పక్కనున్నగోతిలోకి బోల్తాపడింది. కారులో భార్యభర్త, ఒక బాలికతోపాటు వృద్ధ మహిళ పుట్టపర్తికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రంజిత తలకు తీవ్రగాయమై ముక్కునుంచి రక్తస్రావం అవుతోంది. తీవ్రంగా గాయపడిన ఆమెను 108లో చికిత్స నిమిత్తం పెనుకొండ ఆసుపత్రికి తరలించారు. సీఐ శేఖర్ సంఘటనాస్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్

పెనుకొండ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి) : సోమందేపల్లి మండలం మండ్లి గ్రామంలో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి కర్నాటక మద్యంతోపాటు ఒక వ్యక్తిని అరెస్టుచేసినట్లు సీఐ సృజన్‌బాబు తెలిపారు. గ్రామానికి చెందిన మారుతి అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై కర్ణాటక మద్యం రవాణా చేస్తుండగా పట్టుకున్నామన్నారు. అతని వద్ద 96హైపర్ విస్కీ ప్యాకెట్లు దొరికాయన్నారు. వాహనాన్ని సీజ్‌చేసి అతన్ని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు రాజశేఖర్, రాముడు, కానిస్టేబుల్ ఈశ్వర్, హరి, బాలక్రిష్ణ ఉన్నారు.



సీజ్ చేసిన మద్యంతో ఎక్సైజ్ పోలీసులు

ఎట్టకేలకు పురం రోడ్లలో గుంతల పూడ్చివేత



రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

హిందూపురం అర్బన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి):ఎట్టకేలకు పురంలో అధికారులు బైపాస్ రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు, ఎంజీఎం రోడ్లలో మరమ్మతులు చేపట్టారు. ఈ నెల 12న ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'పురం రోడ్లు నిండా గుంతలే' అనే శీర్షికతో కథనం వెలువడిన విషయం విదితమే. దీనిపై ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించారు. ఎక్కడ చూసినా గుంతలు ఏర్పడటంతో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చొరవతో నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్ల మరమ్మతులు చేపట్టారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హిందూపురం బైపాస్ రోడ్డులో 5 కిలో మీటర్ల మేర రూ. 10 లక్షలతో గుంతలు పూడ్చే పని మొదలు పెట్టారు. అదే విధంగా పట్టణంలో మరి కొన్ని చోట్ల గుంతలు పూడ్చేందుకు ఒక పార్టులో రూ.3 లక్షలు, మరో పార్టులో రూ. 2.5 లక్షలతో పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్ అండ్‌బి ఏఈ మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న రోడ్ల మరమ్మతుల్లో భాగంగా పనులు చేపట్టామన్నారు.

ఉద్యోగాల నుంచి తొలగించడం అన్యాయం



పీహెచ్‌సీ ఎదుట ధర్నా చేస్తున్న హెల్త్ అసిస్టెంట్లు

సోమందేపల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి) : గత 20ఏళ్లుగా అవుట్ సోర్సింగ్ హెల్త్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న తమను హఠాత్తుగా ఉద్యోగాల నుంచి ప్రభుత్వం తొలగించడం అన్యాయమని పేర్కొంటూ శుక్రవారం సోమందేపల్లి పీహెచ్‌సీ ఎదుట తిమ్మప్ప, శ్రీనివాసులు, పవన్ కుమార్, శ్రీకాంత్, తదితరులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోవిడ్ లాంటి పరిస్థితుల్లో సేవలందించిన తమను తొలగించడం సబబుకాదన్నారు. 50ఏళ్లు పైబడిన తాము ఈ వయసులో వేరే పనిచేయలేమని పేర్కొన్నారు. ప్రభుత్వం తిరిగి తమను ఉద్యోగంలో తీసుకోవాలని కోరారు. హెల్త్ అసిస్టెంట్‌లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి

గుట్టూరు పీహెచ్‌సీ ఎదుట నిరసన

పెనుకొండ రూరల్: ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు అన్నివిధాలుగా ఆయువుపట్టుగా ఉండే మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లను ప్రభుత్వం తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని వైద్య, ఉద్యోగులు, హెల్త్ అసిస్టెంట్లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం గుట్టూరు పీహెచ్‌సీ ఆవరణంలో ఉద్యోగులు, హెల్త్ అసిస్టెంట్లు నిరసన చేపట్టారు.

కొండ చిలువ స్వైర విహారం

పెనుకొండ టౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహేశ్వర కాలనీలో పట్టపగలే కొండ చిలువ స్వైర విహారం చేసింది. శుక్రవారం జనవాసాల్లోకి రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అనంతరం ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించి దానిని పట్టుకుని అడవిలో వదిలేశారు. కాలనీలో ముళ్లపొదలు, చెట్లు పిచ్చిమొక్కలు అధికంగా ఉన్నాయని అధికారులు, పాలకులు స్పందించి శుభ్రం చేయించాలని కోరారు.

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండండి

అగళి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ సమీవుల్లా, వైద్యాధికారి శివానంద పేర్కొన్నారు. అగళి మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శుక్రవారం ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశ వర్కర్లకు సీజనల్ వ్యాధులు, దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమీవుల్లా, డా.శివానందలు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడేను పాటిస్తే మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, సీజనల్‌వ్యాధులు వ్యాపించకుండా నియంత్రించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డా.గాయిత్రి, పీహెచ్‌ఎన్ లక్ష్మీదేవి, సూపర్వైజర్ నరసారెడ్డి, ఆరోగ్య కార్యకర్త సుందరయ్య, సుధాకర్, రాజు, ల్యాబ్ టెక్నీషియన్ భూషణ్‌నాయక్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి రెవిన్యూ సదస్సులు

అమరాపురం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హాలుకూరు గ్రామంలో రెవిన్యూ సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మారుతీప్రకాష్ మాట్లాడుతూ రెవిన్యూ సదస్సులు సమస్యల పరిష్కారానికి మంచి వేదిక అని ఈసదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా రైతులు దీర్ఘకాలికంగా ఉన్న రెవిన్యూ సదస్సులపై 21 దరఖాస్తులను సమర్పించారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ విన్సెంట్‌పాల్, సర్వేయర్ పుట్టరాజు, రెవిన్యూ కార్యదర్శి అమ్మాజమ్మ, తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీనివాస్, వార్డు మెంబర్ నాగరాజు, మాజీ సర్పంచి ప్రకాష్, నాగభూషణప్ప, పంచాయతీ కన్వీనర్ చెన్నబసప్ప, ఆయకట్టు సంఘం అధ్యక్షులు శివరామప్ప పాల్గొన్నారు.

రొళ్ల, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రొళ్ల మండలంలోని మల్లినమడుగు గ్రామంలో శుక్రవారం రెవిన్యూ సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ షేక్షావలి మాట్లాడుతూ పోతీమార్పులు, అన్నదమ్ముల సమస్యలు, సబ్‌డివిజన్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో గురుమూర్తి, నారాయణప్ప, ఆర్ఐలు పాల్గొన్నారు.

చిరుత దాడిలో లేగదూడ మృతి

గుడిబండ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మద్దనకుంట గ్రామానికి చెందిన తిమ్మప్పకు చెందిన లేగదూడ చిరుత దాడిలో గురువారం రాత్రి మృతి చెందింది. వ్యవసాయ పొలం వద్ద లేగదూడను కట్టివేయడంతో చిరుత దానిపై దాడిచేసి చంపేసింది. దూడ మృతి చెందడంతో సుమారు రూ.20వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపారు. నష్టపరిహారం అందించాలని గ్రామస్తులు కోరారు.

ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

సోమందేపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బ్రహ్మసముద్రం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అమర్నాథ్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వెల్లడైనట్లు శుక్రవారం ఎంపీడీఓ మమతాదేవి తెలిపారు. స్థానికులు గతంలో అవినీతి ఆధారాలు సమర్పించినందున అతనిపై విచారణ జరిపారన్నారు. ఇందులో భాగంగా 2017లో మృతి చెందిన ఉపాధి కూలీ మాల రామక్క పేరును 2023వరకు నమోదుచేసి సొమ్ము స్వాహా చేసినట్టు నిర్ధారణ అయినట్లు తెలిపారు. దీంతో అడడిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేసినట్టు తెలిసింది.